ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | శుక్రవారం | 31.07.2026 | సంపుటి : 2 | సంచిక : 29 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు


## విద్యాభివృద్ధికి ఏం కావాలి..

# ఎలాగైనా తెచ్చిస్తా

**తెలంగాణ విద్యారంగం బలోపేతానికి కృషి**

**పిల్లల భవిష్యత్ తీర్చి దిద్దేందుకే విద్యాశాఖ నేనే చూస్తున్నా**

**పిల్లలను హాస్టళ్లలో వేయడంతో దెబ్బతింటున్న కుటుంబ బంధాలు**

**మండలం క్లస్టర్‌గా విద్యా ప్రణాళిక రూపొందిస్తున్నాం**

**ఉపాధ్యాయుల పదోన్నతలపై అనుమానాలు వద్దు**

**2034 వరకు నేనే ముఖ్యమంత్రిగా ఉంటా**

**సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి**



హైదరాబాద్, జూలై 30 : తెలంగాణను విద్యాపరంగా అగ్రగామిగా నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్కూళ్లను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకే రాష్ట్ర బడ్జెట్‌లో ఏకంగా 9 శాతం నిధులను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ఓట్ల రాజకీయం కోసం కాకుండా, పిల్లల బంగారు భవిష్యత్తును దిద్ది తీర్చాలనే ఏకైక లక్ష్యంతోనే విద్యాశాఖ బాధ్యతలను తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. గతంలో ఉన్నవారు ఇరిగేషన్ శాఖను ఎంచుకుంటే, నేను విద్యాశాఖ బాధ్యతను నా వద్దే ఉంచుకున్నా. 80 వేల పుస్తకాలు చదివానన్న నాయకుడి కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది. కానీ నా ప్రాధాన్యత ప్రాజెక్టులు కావు, పిల్లల చదువులే అని సీఎం అన్నారు. లక్షల మంది ఇంజనీరింగ్ పట్టాలు పొందుతున్నా,

-మిగతా 2 లో..

## కూరగాయల సాగును ప్రోత్సహించండి

**సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి**

**ఆర్గానిక్ సాగు దిశగా రైతులకు అవగాహన కల్పించండి**

**నిపుణుల కమిటీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

02



**బీఆర్ఎస్ నేత**

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కన్నుమూత

**అర్ధరాత్రి 12.50 గంటలకు మృతి**

**ప్రకటించిన యశోద ఆస్పత్రి వైద్యులు**

హైదరాబాద్, జూలై 30 : బీఆర్ఎస్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గురువారం అర్ధరాత్రి 12.50 గంటలకు కన్నుమూశారు. ఈ మేరకు సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. ఈ నెల 26న ఉదయం హనుమకొండలో ఆయనకు ఛాతీలో నొప్పి రావటంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు కార్డియాక్ అరెస్ట్‌గా గుర్తించారు. గంట సేపు శ్రమించి తొమ్మిది సార్లు సీపీఆర్ చేశాక..

మిగతా 2 లో



## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

**మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం**

**'పేపర్ లీక్ గ్యాంగ్‌లను వదిలే ప్రసక్తే లేదు'..**

**పీఎం మోదీ స్ట్రాంగ్ వార్నింగ్**

న్యూఢిల్లీ, జూలై 30 : ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధక బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. విపక్షాల ఆందోళనల నడుమ మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లుకు ఇప్పటికే లోక్‌సభ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. దీంతో ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధానికి ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ పరీక్షల (అనుచిత పద్ధతుల నివారణ) సవరణ బిల్లు 2026' ఉభయ సభలు ఆమోదం తెలిపినట్లు అయ్యింది. దీని ప్రకారం.. పేపర్ లీక్ కేసుల్లో దోషులకు గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. ఇక వ్యవస్థీకృత నేరాల్లో దోషులకు కనీసం ఏడేళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా నిబంధనలు రూపొందించారు.



**'పేపర్ లీక్ గ్యాంగ్‌లను వదిలే ప్రసక్తే లేదు'..**

పేపర్ లీక్ గ్యాంగ్‌లను వదిలిపెట్టే ప్రసక్తే లేదనిస ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. అందుకే పార్లమెంట్‌లో యాంటి పేపర్ లీక్ బిల్ పాస్ చేశామని వెల్లడించారు. ఈ మేరకు ప్రధాని మోదీ సోషల్ మీడియాలో మరో

మిగతా 2 లో



# ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు

**పొంగిపొర్లుతున్న వాగులు వంకలు**

**ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదులు**

**మేడిగడ్డ వద్ద వరద ఉధృతితో 85 గేట్లు ఎత్తివేత**

**శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద ఉధృతి**

**కడెం జలాశయానికి భారీగా వరదనీరు చేరిక**

**భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి మట్టం**

**ములుగు జిల్లా బొగత జలపాతం సందర్శన నిలిపివేత**

హైదరాబాద్, జూలై 30 : వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే రానున్న మరో మూడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణ వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు నదులు, ఉపనదులు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ, మహారాష్ట్రల్లోని ఎగువ ప్రాంతాల్లో వర్షాపాతం తీవ్రమవడంతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని పలు కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి

- మిగతా 2 లో..

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు**

**ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు**

**అధికారులతో మంత్రి పొంగులేటి టెలికాన్ఫరెన్స్**

**భారీ వర్షాలు కురిసే అవకావంఉండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తున్న తీవ్ర వాయుగుండం, చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.**



హైదరాబాద్, జూలై 30 : జిల్లా స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం రెవెన్యూ, విపత్తు నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్

-మిగతా 2 లో..



02

## ఓటరు జాబితా సవరణతో పథకాలకు సంబంధం లేదు

**ప్రజలు అనవసర అపోహలకు గురి కావద్దు**

**ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ**



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| పారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

**12 గుడ్ల రిటైల్ ధర ₹86**

## ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు విడుదల

**ఉద్యోగులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ప్రభుత్వం**

**100 రోజుల్లో రూ. 6,000 కోట్ల చెల్లింపులు**

**ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ**

హైదరాబాద్, జూలై 30 : ఉద్యోగులకు ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. గత 100 రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన రూ.6, 000 కోట్ల బకాయిల చెల్లింపులను పూర్తి చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. గురువారం మరో రూ.2,000 కోట్లను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,

-మిగతా 2 లో..






**మోడీ సోషల్ మీడియా**

## ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

- ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది
- రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన
- కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక

03

## నిర్భయంగా పనిచేయండి.. బాధ్యత నేను తీసుకుంటా

**విధి నిర్వహణలో భయానికి తావు లేదు**

**నిజాయితీగా విధులు నిర్వహించండి**

**సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర కీలక వ్యాఖ్యలు**

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. విధుల్లో ధైర్యసా హసాలు ప్రదర్శించిన సిబ్బందికి సన్మానం చేసిన కార్యక్రమంలో ఆయన ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. ఎలాంటి భయం లేకుం డా పనిచేయాలని బలగాలకు పిలుపునిచ్చారు. "సీఆర్‌పీఎఫ్ డైరెక్ట ర్‌గా ఇక్కడ నేను మీకో హామీ ఇస్తున్నాను. విధులు నిజాయతీగా నిర్వర్తించడంలో మీరు తీసుకునే నిర్ణయాలు, చర్యలకు నేను బాధ్యత వహిస్తాను.





04

జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం.

## 'పేపర్ లీక్ గ్యాంగ్‌లను వదిలే ప్రసక్తే లేదు'..

(మొదటిపేజీ తరువాయి)



వీడియో రిలీజ్ చేశారు. పరీక్షల వ్యవస్థలో సంస్కరణలు కొనసాగుతాయని నరేంద్ర మోదీ తెలిపారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడేవారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వికసిత్ భారత్ దిశగా ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. కాగా.. ఈ ఏడాది నీట్ పరీక్ష పేపర్ లీకైన సంగతి తెలిసిందే. ఈ పరీక్షను దేశవ్యాప్తంగా మరోసారి నిర్వహించారు. ఈ పేపర్ లీక్‌పై కాక్‌రోచ్ జనతా పార్టీ ఆందోళనకు దిగింది, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టారు. సీజేపీ చీఫ్ అభిజీత్ దిప్కే ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీంతో నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం యాంటి పేపర్ లీక్ బిల్‌ను తీసుకొచ్చింది. ఈ బిల్లుకు లోక్ సభ కూడా ఆమోదం తెలిపింది.

## వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం

### లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు

**న్యూఢిల్లీ, జూలై 30 :** వందేమాతరం గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లుకు లోక్‌సభ కూడా తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో ఇది చట్ట రూపం దాల్చనుంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేడు మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. జాతీయ గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించేలా నేషనల్ ఆనర్ యాక్ట్-1971 చట్టంలో మార్పుల కోసం కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రాజ్యాంగం, జాతీయ జెండా, జాతీయ గీతాన్ని అవమానించిన వారికి ప్రస్తుతం గరిష్ఠంగా మూడేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఇకపై జాతీయ గేయాన్ని అవమానించిన వారికి కూడా ఇదే శిక్ష పడేలా చట్టంలో మార్పులు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపిన ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో కేంద్రం ఈ గేయానికి మరిన్ని రక్షణలు కల్పిస్తూ తాజా బిల్లును తీసుకొచ్చింది. బంకిమ్ చంద్ర ఛటర్జీ 1875లో ఈ గేయాన్ని రచించారు. ఆనంద్‌మఠ్ నవలలో భాగంగా తొలిసారి 1882లో ఈ గేయం ప్రచురితమైంది. ఇక ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గేయం ఆలాపనకు సంబంధించి కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు నూతన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. రాజ్యసభలో ఈ బిల్లును జులై 24న ప్రవేశపెట్టగా జులై 29న ఆమోదం లభించింది. నేడు లోక్‌సభ కూడా బిల్లుకు ఆమోదం తెలిపింది. నీట్ పేపర్ లీక్ వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనల నడుమ రెండు సభల్లోనూ బిల్లుకు ఆమోదం లభించింది.

## ఉద్యోగుల బకాయిల విడుదల

(మొదటిపేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం మూడు విడతల్లో ఒక్కోసారి రూ.2,000 కోట్ల చొప్పున మొత్తం రూ.6,000 కోట్లను విడుదల చేసింది. దీంతో పెండింగ్‌లో ఉన్న విశ్రాంత ఉద్యోగుల కమ్యూటేషన్ బకాయిలను పూర్తిగా చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న ఇతర బకాయిలను కూడా దశలవారీగా విడుదల చేస్తామని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగులు, పెన్షనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ జేఏసీ నాయకులకు ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల్లో రూ. 6,000 కోట్ల బకాయిలను విడుదల చేస్తామన్న మాటను తెలంగాణ ప్రభుత్వం నిలబెట్టుకుంది. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసాగుతూ తమ చిత్తశుద్ధిని మరోసారి చాటుకుంది. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. విశ్రాంత ఉద్యోగులకు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం ఈ నిధులతో పూర్తిగా చెల్లించింది. రాబోయే రోజుల్లో మిగిలిన ఇతర బకాయిలను కూడా ఇదే రీతిలో క్రమపద్ధతిలో క్లియర్ చేస్తామని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ప్రభుత్వం ఉద్యోగుల బకాయిల నిధులు విడుదల చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంది తీవ్ర హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక ప్రతికూల పరిస్థితుల్లోనూ ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం చూపిస్తున్న సానుకూల ధోరణి అభినందనీయమని ఉద్యోగ జేఏసీ నేతలు కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఓటరు జాబితా సవరణతో పథకాలకు సంబంధం లేదు

### ప్రజలు అనవసర అపోహలకు గురి కావద్దు

### ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ

**హైదరాబాద్, జూలై 30 :** రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా సవరణకు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిఇఓ మాట్లాడుతూ కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ కేవలం తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు మాత్రమేనని, ప్రభుత్వం పథకాలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించేందుకు మరో నాలుగు రోజులు గడువు మాత్రమే ఉన్నందున ఆగస్టు మూడవ తేదీలోగా డిజిటలైజేషన్ ప్రక్రియ 100శాతం పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 76శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని, గ్రామీణ ప్రాంతాల్లో 90శాతం పూర్తయిందని, ఇందులో ఖానాపూర్, బాల్కొండ, ఎల్లారెడ్డి, హుజూర్ నగర్, నర్సంపేట్, వర్ధన్నపేట్, పరకాల, బోద్ నియోజకవర్గాల్లో 100శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఇందుకు సంబంధించిన అధికారులను సిఇఓ ప్రశంసించారు. శేరిలింగంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, జిహెచ్ఎంసితో పాటు నిజామాబాద్, వరంగల్, ఖమ్మం లిం పట్టణ ప్రాంతాలలో డిజిటలైజేషన్ ప్రక్రియపై సంబంధిత డిఇఓలు ప్రత్యేక దృష్టి సారించి డిజిటలైజేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలను డిజటలైజేషన్ చేయడంలో ఓటరు పేర్లను తప్పులు లేకుండా అప్ లోడ్ చేసేలా బిఎల్ఓలు, సూపర్ వైజర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇఆర్ఓ, ఎఇఆర్ఓలు దీనిపై సమీక్షించి తప్పులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. డిజిటలైజేషన్ లో నిర్లక్ష్యం వహించిన బిఎల్ఓలు, సూపర్ వైజర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఇఓ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్ల రాష్నాలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. ఓటర్లలో మరణించిన వారు, ఇల్లుమరిన వారి వివరాలు, అందుబాటులో లేని వారి జాబితాను సిద్ధంచేసేటప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన బిఎల్ఎల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఇఆర్ఓ, ఎఇఆర్ఓ, బిఎల్ఓ స్థాయిలలో జరిగే రాజకీయ పార్టీల సమావేశాలను వీడియోగ్రాఫ్ చేసి డాక్యుమెంట్ చేయాలన్నారు. దాంతోపాటు విఐపి, వివిఐపిల ఓటర్లను గుర్తించి మ్యాపింగ్ చేయాలన్నారు.

# విద్యాభివృద్ధికి ఏం కావాలి..

# ఎలాగైనా తెచ్చిస్తా

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగానికి దరఖాస్తు రాసుకోలేని పరిస్థితి రాకూడదని, విద్యా ప్రమాణాలను పెంచడమే తమ నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. చిన్నతనంలోనే పిల్లలను హాస్టళ్లలో వేయడం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బ తింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంటరిగా పెరిగే పిల్లలు పెద్దయ్యాక తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులే తల్లిదండ్రుల స్థానంలో ఉండి పిల్లలకు సరైన మార్గదర్శనం చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయంగా, ప్రతి మండలాన్ని ఒక క్లస్టర్‌గా తీసుకుని విద్యా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. విద్యాబోధనలో అంతర్జాతీయ ప్రమాణాలు అందించేందుకు ఏటా 10 నుండి 12 మంది ఉపాధ్యాయులను 'స్టడీ లీవ్'పై విదేశాలకు పంపిస్తామని ప్రకటించారు. టీచర్ల ప్రమోషన్లు, బదిలీల బాధ్యతను తానే చూసుకుంటానని, అడగకుండానే ఒకటో తేదీన జీతాలు వేస్తున్నామని గుర్తుచేశారు. ఇదే క్రమంలో తన రాజకీయ ప్రస్థానంపై స్పందిస్తూ 2034 వరకు నేనే సీఎంగా ఉంటాను, ఎలాంటి సందేహాలు వద్దని ధీమా వ్యక్తం చేశారు. దీనిపై ఎవరూ ఎలాంటి అనుమానాలు, డౌట్లు పెట్టుకోవాల్సిన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయుల బృందంతో ఇవాళ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్వహణలో తాము మానవత్వంతో వ్యవహరిస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులతో మాట్లాడిన సీఎం, వారి సమస్యల పరిష్కార బాధ్యతను పూర్తిగా తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రమోషన్లు, బదిలీలు ఇంటికే వస్తాయని, ఉపాధ్యాయులు కేవలం విద్యార్థుల భవిష్యత్తు, బడులలో సౌకర్యాల పైనే



దృష్టి పెట్టాలని కోరారు. ఐఏఎస్ అధికారులనైనా సులభంగా బదిలీ చేయవచ్చని, కానీ టీచర్ వ్యవస్థ అత్యంత శక్తివంతమైనదని కొనియాడారు. బడులలోని పిల్లల సమస్యలపై తనతో చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడులలో చదివితే ఏం అవుతావు?' అని ఎవరైనా అడిగితే, 'తెలంగాణ సీఎం అవుతాను' అని పిల్లలు ధైర్యంగా చెప్పాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తాను స్వయంగా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని, ఎలాంటి మంత్రి పదవి అనుభవం లేకపోయినా ఈరోజు సమర్థవంతంగా రాష్ట్రాన్ని పాలిస్తున్నానని గుర్తుచేశారు. ఇటీవల తాను హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని చెబుతూ, కేవలం తెలివి ఉంటే సరిపోదని, క్రమశిక్షణెళి మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడుతుందని నొక్కి చెప్పారు. ఉపాధ్యాయులు అడగకపోయినా 2024 జనవరి నుంచి ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా సమయానికి వేతనాలు ఇస్తున్నామని స్పష్టం చేశారు.

అలాగే హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ ఛార్జీలను సైతం పెంచామని వివరించారు. అమెరికాపైనే కాకుండా జర్మనీ, జపాన్ వంటి దేశాల వైపు దృష్టి సారించాలని, భాష అనేది కేవలం ఒక సంభాషణ మాధ్యమం మాత్రమేనని పేర్కొన్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమై సమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇకపోతే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అప్పులు ఎక్కువగా చేశారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందరూ ప్రధాన మంత్రుల కంటే మోదీ అప్పులు ఎక్కువ చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకూ రూ.51లక్షల కోట్ల అప్పు ఉందని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు ప్రధాని రూ.151లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. విమర్శలు గుర్తు చేసుకుంటూ ఉంటే మనం మనుగడ సాధించలేమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుకి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. విద్యావ్యవస్థ తమ హయాంలో బలపడిందని తెలిపారు. 28వ స్థానంలో ఉన్న మన రాష్ట్రం ఇప్పుడు దేశంలో 18వ స్థానానికి చేరిందని వ్యాఖ్యానించారు. తాను ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. విద్యాశాఖకు మంత్రి లేరని.. తాను రాజీనామా చేయాలని ప్రతిపక్షాల నేతలు అంటున్నారని అన్నారు. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్, స్నాక్స్ పెట్టినందుకు రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. తాను కూడా మెళకువలు నేర్చుకోవడానికి హార్వర్డ్ వెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

## కూరగాయల సాగును ప్రోత్సహించండి

### సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి

### ఆర్గానిక్ సాగు దిశగా రైతులకు అవగాహన కల్పించండి

### నిపుణుల కమిటీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూలై30 :** రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది. గత ఏడాది ఈ సీజన్ లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62



లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్పిం÷-రక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందించి? పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లను స్థాపించేందుకు ఆర్థిక సహాయం అందించాలని, అత్యవసర చర్యల అమలును పర్యవేక్షించేందుకు గ్రామస్థాయి బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, సాగునీరు, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలను పరిరక్షించేందుకు రూపొందించిన రాష్ట్ర స్థాయి సమగ్ర కార్యాచరణ నివేదికను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి గురువారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి బోధి సెంటర్ లో అందజేశారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి, వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులు కృపాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి లు కూడా పాల్గొన్నారు.

## ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

చేరుతుండటంతో జలాశయాలు సంతరించుకుంటున్న జలకళ రైతుల్లోనూ, ప్రజల్లోనూ తీవ్ర ఆనందాన్ని నింపుతోంది. నిజామాబాద్ జిల్లాలోని ప్రతిష్టాత్మక శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 12,900 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, ప్రాజెక్టు నీటి నిల్వ 17.103 టీఎంసీలకు చేరింది. కాకతీయ కాలువ ద్వారా దిగువకు 300 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. అలాగే, నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలంలో ఉన్న స్వర్ణ ప్రాజెక్టుకు ఉదయం వేళకు నీటి సామర్థ్యం అర టీఎంసీ దాటి, ఇన్ ఫ్లో దాదాపు 10 వేల క్యూసెక్కులకు చేరింది. నిర్మల్ జిల్లాకే తలమానికమైన కడెం ప్రాజెక్టుకు వరద నీరు విపరీతంగా పోటెత్తుతోంది. ఉదయం 11:00 గంటల సమయానికి కడెం ప్రాజెక్టుకు ఏకంగా 77,442 క్యూసెక్కుల భారీ ఇన్ ఎ÷-లో నమోదు కాగా, పరిస్థితికి అనుగుణంగా అధికారులు 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇక జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద ప్రాణహిత, గోదావరి ఉభయ నదులు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అక్కడ నీటిమట్టం 6.320 మీటర్ల ఎత్తులో మెట్ల వద్దకు చేరడంతో తీరం కొత్త రూపు సంతరించుకుంది. గోదావరి జలాలు పోటెత్తడంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ కి ఇన్ ఫ్లో భారీగా పెరిగింది. ఎన్డీఎస్ఏ సూచనలను పాటిస్తూ అధికారులు బ్యారేజ్ కి చెందిన మొత్తం 85 గేట్లను ఎత్తి ఉంచారు. ప్రస్తుతం అక్కడ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో సమంగా 1,01,530 క్యూసెక్కులుగా కొనసాగు తుండటంతో గోదావరి ప్రవాహం దిగువకు వేగంగా పయనిస్తోంది. ప్రాజెక్టుల్లో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతుండటంతో నీటిపారుదల శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురియ నుండటంతో 9 జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు భారీ వర్షాల నేపథ్యంలో 6 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాలకు ఉత్తర తెలంగాణతో పాటు నిజామాబాద్ జిల్లాలోని చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలను దృష్టిలో పెట్టుకొని జగిత్యాల జిల్లాలో పాఠశాలలకు సెలవను ప్రకటించారు. ఈ సీజన్‌లో తొలిసారిగా జూరాల ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదలారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితోపాటు, పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటిమట్టం పెరుగుతోంది. గురువారం ఉదయానికి 27 అడుగులకు చేరింది. నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తున్నది. దీంతో అప్రమత్తమైన ప్రాజెక్టు అధికారులు ప్రాజెక్టు 6 వరద గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఇన్ ఫ్లోగా ప్రాజెక్టులోకి 77,442 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు 6 వరద గేట్లు 10 ఫీట్లు గేట్లు ఎత్తి అవుట్ ఎ÷-లోగా 67, 000 క్యూసెక్కుల నీటిని దిగవనున్న గోదావరిలోకి అధికారులు వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు 3.495 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 693.725 అడుగులు 2.212 టీఎంసీలలో ప్రాజెక్టు నీటి సామర్థ్యం కొనసాగుతుంది.

## బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)



కొంత ఫలితం కనిపించడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స ఆరంభించారు. సుదీర్ఘకాలం స్పృహలో లేకపోవడం వల్ల ఆయనలో నాడీ సంబంధిత స్పందన కనిపించలేదని వైద్యులు తెలిపారు. ఆక్సిజన్ లోపం కారణంగా మెదడుకు నష్టం జరిగినట్లు ఈసీజీ, బ్రెయిన్ ఎంఆర్ఐ, టీసీడీ పరీక్షల్లో సూచనలు కనిపించాయని పేర్కొన్నారు. 5 రోజుల అనంతరం ఆయన గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. 1974 ఆగస్టు 6న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మండల కేంద్రం నల్లబెల్లిలో రైతు కుటుంబంలో జన్మించిన సుదర్శన్‌రెడ్డి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఆయన 2018లో నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తొలుత కాంగ్రెస్‌లో ఉన్న ఆయన.. 2001లో తెరాస (ప్రస్తుత బీఆర్ఎస్)లో చేరి అదే ఏడాది నల్లబెల్లి జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు. తెరాస ప్రభుత్వంలో 2015 పౌర సరఫరాల సంస్థ రాష్ట్ర ఛైర్మన్‌గా పనిచేసి 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. రాష్ట్రంలో గడచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, రాబోయే రెండు రోజుల్లో కురిసే వర్షాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి. ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ, అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే స్పందించి సహాయక చర్యలు అందించాలని సూచించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రవాణా, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా(హైడ్రా, జిహెచ్ ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు రోజుల క్రితం వరకు రాష్ట్రంలో 30శాతం మేర ఉన్న వర్షపాతం లోటు, గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో భర్తీ అయి దాదాపు సాధారణ స్థాయికి చేరుకుందని మంత్రి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వివిధ జిల్లాలకు అలర్ట్‌లు జారీ అయ్యాయని మంత్రి తెలిపారు. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశామని అలాగే నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామని తెలిపారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

## శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం

**కర్నూలు, జూలై 30 :** కృష్ణా నది ఎగువ పరివాహ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 79,403 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు చేరుతోంది. శ్రీశైలం నీటిమట్టం గురువారం ఉదయం 6 గంటలకు 824.80 అడుగులు.. నీటి నిల్వ 44.6090 టీఎంసీలుగా నమోదయింది. శ్రీశైలం కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించలేదు. వరద ఉధృతితో జూరాల జలాశయం కళకళలాడుతోంది. కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి మూడు రోజులుగా దిగువకు కృష్ణా జలాలు విడుదల చేస్తుండటంతో జూరాలలో క్రమేపీ మట్టం పెరుగుతోంది. జూరాల ఇన్‌లో గురువారం ఉదయం 80వేల క్యూసెక్కులుగా నమోదైంది. జలవిద్యుత్ ఉత్పత్తితో 47వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా.. 10 గేట్లు ఎత్తి శ్రీశైలానికి నీరు విడుదల చేశారు.

# మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

- ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది
- రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు
- కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక




**పుణె, జూలై 30 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు. దేశాన్ని పాలించడం కంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యతను మరో నాయకుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువతలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉద్ధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు. వీరు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును ఇలాంటి పరిస్థితులకు గురి చేస్తే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే అవసరమైతే ప్రభుత్వాన్నీ మార్చే ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. ఈసారి ఆందోళన మరింత భారీస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సీజేపీ నిరసన సందర్భంగా విద్యార్థులపై పెలెట్ గన్ వినియోగించిన ఘటనపైనా అభిజీత్ స్పందించారు. అమిత్ షా అయినా, మరెవరైనా సరే పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను సీజేపీ వ్యవస్థాపకుడు తిప్పికొట్టారు. కార్యకర్తలు 36 రోజుల పాటు ఎండ, వర్షాన్ని లెక్కచేయకుండా కష్టపడి పోరాడారని, అలాంటి విజయం తర్వాత సంబరాలు చేసుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. తమ కార్యకర్తలు బీజేపీ మాదిరిగా రహదారులను దిగ్బంధం చేయలేదన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత ఆయనను సన్మానించడం ద్వారా బీజేపీ ఏ సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని అభిజీత్ ఆరోపించారు. ప్రధాని మోదీ మూడు రోజుల క్రితం పేపర్ లీక్ కేసుల కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారని, అయితే తొలి విచారణకే సీబీఐ తరఫు న్యాయవాది హాజరుకాకపోవడంతో కేసు వాయిదా పడిందని విమర్శించారు. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన విమర్శలపైనా అభిజీత్ దీప్కే స్పందించారు. ఆమె పార్ట్‌టైమ్ రాజకీయ నాయకురాలని, సీరియస్ రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యలకే తాను స్పందిస్తానని వ్యాఖ్యానించారు.



## ఎగుమతుల వృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

- అనుకూలమైన విధానాల అమలుపై దృష్టి
- ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో సంజయ్ జాజు

**హైదరాబాద్, జూలై 30 :** రాష్ట్రంలో ఎగుమతుల వృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త మార్కెట్ల అన్వేషణ, ఎగుమతులకు అనుకూలమైన విధానాల అమలుపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఃక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సి.ఎస్. అధ్యక్షతన రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలు, తయారీ (మ్యానుఫ్యాక్చరింగ్) యూనిట్లు, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, హస్తకళలు, ఐటీ ఆధారిత సేవలు తదితర రంగాల ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. గుమతుల ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమివ్వడంతో పాటు తెలంగాణను దేశంలోని ప్రముఖ ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. త ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం నుంచి రూ. 1,22,655 కోట్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయని అధికారులు సమావేశంలో తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యానవన పంటలు (హార్టికల్చర్), పౌల్ట్రీ ఉత్పత్తులు, వెజిటబుల్ సీడ్స్, రెడ్ చిల్లీ తదితర రంగాల్లో ఎగుమతులను గణనీయంగా పెంచే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు మరింతగా ఎగుమతి చేసేందుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ అధికారులతో సమన్వయం పెంపొందించి రాష్ట్ర ఎగుమతుల వృద్ధికి మరింత కృషి చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ సమావేశంలో పర్యాటక, సంస్కృతి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, రవాణా శాఖ కమిషనర్ ఇల్లంబర్తి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డా.జి.ముకుంద రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఎగుమతుల ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



## వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన**

**హైదరాబాద్, జూలై 30 :** తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల వల్ల ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాల ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

- అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాల స్వీకరణ
- జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సుల నిర్వహణ
- అధికారులతో సమీక్షించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, జూలై 30 :** అంగన్‌వాడీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాలు, సూచనలు స్వీకరించేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్లు, ఆయాలకు అందించే నూతన యూనిఫామ్‌లను పరిశీలించి, అక్టోబర్ మొదటి వారంలోగా వాటిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం 17 ఉన్న శిశు దత్తత కేంద్రాలను విస్తరించి ప్రతి జిల్లాలోనూ ఒక అడాప్షన్ సెంటర్ ఉండేలా చూడాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో కలెక్టర్లతో మాట్లాడి నియామక పక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ నిధులు ల్యాప్స్ కాకుండా పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులకు నిర్దేశిరచారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక పక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

## గణేష్ విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం

**తయారీదారులను ఆదేశించిన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్**

**హైదరాబాద్, జూలై 30 :** గణేష్ విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం చేయాలని తయారీదారులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశించారు. వినాయక చవితి సమీపిస్తుంది. ఈ నేపథ్యంలో విగ్రహాల తయారీ దశ నుంచే భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని వారికి స్పష్టం చేశారు. గణెళిశ్ ఉత్సవాలపై హైదరాబాద్ పోలీసులు ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. అందుకోసం గురువారం నగర సీపీ వీసీ సజ్జనర్ అధ్యక్షతన విగ్రహ తయారీదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా ఉత్సవాలు నిర్వహించడమే లక్ష్యమని ఈ సందర్భంగా వారికి సీపీ స్పష్టం చేశారు. గతేడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల గణెళిశ్ విగ్రహాలను ప్రతిష్టించినట్లు వివరించారు. విగ్రహాల రవాణా సమయంలో గతేడాది నాలుగు ప్రమాదాలు జరిగాయని నగర సీపీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తప్పని సరి అని వారికి సూచించారు. మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని తయారీదారులను కోరారు. చిన్న విగ్రహాల ప్రతిష్టాపనపై భక్తులకు అవగాహన కల్పించాలని వివరించారు. విగ్రహాల తయారీ కేంద్రాల్లో ÷ర్ సేఫ్టీ, సురక్షితమైన విద్యుత్ వైరింగ్ నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. దూల్‌పేట్, జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లి నుంచి విగ్రహాల రవాణాకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణాను నివారించాలని ఆదేశించారు. రవాణాకు ముందు స్థానిక ట్రాఫిక్ పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. విగ్రహాల బుకింగ్, రవాణా సమయం, మార్గాల వివరాలు ముందుగానే పోలీసులకు ఇవ్వాలని తయారీదారులను ఆదేశించారు. భారీ విగ్రహాల రవాణాలో విద్యుత్ తీగలు, ఫ్లై ఓవర్లు, మెట్రో మార్గాలకు ఆటంకం కలగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉపయోగించే క్రేన్లు, వాహనాలు సర్టి÷డ్ అయి ఉండాలని వారికి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వినాయకుని విగ్రహాల తయారీదారులను నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

## బెంగాల్లో మాజీ డ్రైవర్ ఇంట్లో నోట్ల కట్టలు

**సుమారు రూ.28 కోట్ల నగదు, 15 కిలోల పసిడి స్వాధీనం**

**కోల్‌కతా, జూలై 30 :** పశ్చిమ బెంగాల్‌లోని ఓ మాజీ డ్రైవర్ ఇంట్లో పెద్దఎత్తున నగదు, బంగారం బయటపడటం తీవ్ర దుమారం రేపుతోంది. బీర్‌భూమ్ జిల్లాలో మీనార్ మొండల్ అనే విశ్రాంత బస్సు డ్రైవర్ నివాసంలో పోలీసులు నిర్వహించిన సోదాల్లో ఇప్పటివరకు సుమారు రూ. 28 కోట్ల నగదు, 15 కిలోల పసిడి స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు వెల్లడించారు. నోట్ల కట్టలు భారీగా ఉండటంతో.. వాటిని లెక్కించే క్రమంలో 5 కౌంటింగ్ మెషీన్లు విఫలమైనట్టు తెలుస్తోంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. తులు మొండల్ అనే శిలల వ్యాపారికి మీనార్ మొండల్ బంధువు. తులు మొండల్.. తృణమూల్ కాంగ్రెస్ మాజీ నేత అనుబ్రత మొండల్‌కు సన్నిహితుడు. ఈ నేపథ్యంలో వీరు అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో సోదాలు నిర్వహించగా.. తొలుత రూ. 5.5 కోట్ల నగదు, 15 కిలోల బంగారం లభించాయి. ఆ తర్వాత తనిఖీలు కొనసాగించడంతో నగదు మొత్తం సుమారు రూ. 28 కోట్లకు చేరింది. ఈ ఘటనపై మీనార్ మొండల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో ఈ నగదు, బంగారం తులు మొండల్‌కు చెందినదని, అక్రమ కార్యకలాపాలు నిర్వహించి పొందిన సొమ్ముగా పేర్కొన్నట్లు సమాచారం. అయితే దీనిపై అధికారులు ఇంకా ఎలాంటి అధికారిక వివరాలూ వెల్లడించలేదు. అక్రమ ఆర్థిక లావాదేవీలు, ఇసుక-రాతి మాఫియా కార్యకలాపాలతో ఈ వ్యవహారానికి సంబంధాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఃాష్ట్ర రవాణా శాఖ ఉద్యోగిగా పనిచేసిన మీనార్ మొండల్.. పదవీ విరమణ పొందాక వ్యాపార రంగంలోకి అడుగుపెట్టినట్టు దర్యాప్తులో వెల్లడైంది. అయితే.. ఇంత భారీగా ఆస్తులు ఎలా కూడబెట్టాడనే అంశంపై అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై రాజకీయంగానూ తీవ్ర విమర్శలు వ్యక్తమవుతుండగా.. టీఎంసీ వర్గాలు పరస్పర ఆరోపణలకు దిగాయి. నిందితులకు కొందరు పేరున్న నాయకులతో సంబంధాలున్నాయంటూ పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి, అక్రమ సంపద వెనకున్న వారందరినీ చట్టం ముందు నిలబెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## సోషల్ మీడియాలో ప్రధాని రాజీనామా లేఖ

**ఫేక్ లేఖగా గుర్తించిన కేంద్ర సంస్థ పిఐబి**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన**

**న్యూఢిల్లీ,జూలై30 :** ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేసినట్లు ఆయన సంతకంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ పూర్తిగా ఫేక్ అని కేంద్ర ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం నిర్ధారించింది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అలాంటి లేఖ ఏదీ విడుదల కాలేదని, మోదీ కూడా దానిపై సంతకం చేయలేదని స్పష్టం చేసింది. నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ ఫేక్ లెటర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అధికారిక వర్గాల నుంచి నిర్ధారణ చేసుకోకుండా ఇలాంటి సందేశాలను నమ్మకూడదని, ఫార్వర్డ్ చేయకూడదని 'ఎక్స్' వేదికగా పీఐబీ సూచించింది. 'ప్రధాని సంతకంతో ప్రచారంలో ఉన్న లేఖ పూర్తిగా ఫేక్. తప్పుడు పత్రాలు, నకిలీ మెసేజ్ల ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం, తప్పుగా ప్రచారం చేయడం, కొన్ని సందర్భాల్లో ఆర్థిక మోసాలకు పాల్పడటం జరుగుతుంది' అని తెలిపింది. వైరల్ పోస్టులను ఆధారంగా చేసుకుని వ్యక్తిగత, ఆర్థిక వివరాలను షేర్ చేసుకోవద్దని, పెట్టుబడుల వంటి నిర్ణయాలు తీసుకోవద్దని పౌరులకు సూచించింది పీఐబీ. అనుమానాస్పద పోస్టులు, నకిలీ పత్రాలు కనిపిస్తే పీఐబీ ఫ్యాక్ట్ చెక్ బృందానికి వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరింది.

## భారీ వర్షాలు కురిసే ఛాన్స్

**ఆదిలాబాద్, జగిత్యాలకు రెడ్ అలర్ట్**

**హైదరాబాద్, జూలై 30 :** తీవ్ర వాయుగుండం నేపథ్యంలో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు జగిత్యాల జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ రెండు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉమ్మడి నిజామాబాద్‌తోపాటు రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్‌తోపాటు హనుమకొండ, జనగాం, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం ప్రకటించింది.

## వర్షాలతో రైతులకు ఊరట

**ఆరుతడి పంటల ప్రోత్సాహానికి చర్యలు**

**సిఎంకు సమర్పించిన నివేదికపై చిన్నారెడ్డి వివరణ**

**హైదరాబాద్, జూలై 30 :** గత మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు ఊరటనిచ్చాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి తెలిపారు. ఈ వర్షాలతో లభించిన తేమను, అందుబాటులోకి వచ్చిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకొని ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలను విజయవంతంగా సాగు చేసుకునేలా ప్రభుత్వం అమలు చేయదగిన ఆచరణాత్మక సూచనలను కమిటీ ప్రభుత్వానికి అందజేస్తుందని చెప్పారు. అనంతరం వివిధ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు సంయుక్తంగా రూపొందించిన నివేదికలోని ముఖ్యాంశాలను కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నివేదికలో తక్షణ, మధ్యకాల, దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళికలతో పాటు రైతుల జీవనోపాధి పరిరక్షణ, నీటి వనరుల సమర్థ వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, పశుగ్రాస భద్రత, గ్రామీణ ఉపాధి కల్పన వంటి అంశాలపై సమగ్ర సిఫార్సులు చేశారు. రాష్ట్రంలో సాధారణ నైరుతి రుతుపవనాల వర్షపాతం 740.60 మిల్లీమీటర్లు కాగా, జూలై 27 నాటికి 234.80 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదై, సాధారణంతో పోలిస్తే సుమారు 30 శాతం లోటు నమోదైనట్లు కమిటీ పేర్కొంది. రాష్ట్రంలోని అత్యధిక జిల్లాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో పాటు భూగర్భ జలమట్టం కూడా గణనీయంగా పడిపోయినట్లు నివేదికలో వివరించింది. వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో సాగు విస్తీర్ణం తగ్గినందున, నీటి అవసరం ఎక్కువగా ఉండే పంటలకు బదులుగా కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, రాగులు, నూనెగింజలు, కూరగాయలు, పశుగ్రాస పంటలు వంటి ప్రత్యామ్నాయ పంటలను గ్రామాల వారీ కార్యాచరణ ప్రణాళికతో విస్తృతంగా ప్రోత్సహించాలని కమిటీ సూచించింది. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను 75 శాతం వరకు సబ్సిడీపై రైతులకు అందించాలని సిఫార్సు చేసింది.

## యాపిల్ పండ్ల లోడ్ డీసీఎం బోల్తా

- పండ్ల కోసం పోటీపడి ఎత్తుకెళ్లిన ప్రజలు
- డ్రైవర్ ప్రాణాపాయంలో ఉన్న పట్టించుకోని జనం

**మహబూబాబాద్, జూలై 30 :** యాపిల్ లోడ్‌తో వెళ్తున్న డీసీఎం బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌ను కాపాడాల్సింది పోయి.. యాపిల్ పండ్ల కోసం పోటీ పడిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో వైరల్‌గా మారింది. హబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం మాటేడు గ్రామ స్టేజి వద్ద వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై యాపిల్ పండ్ల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వాహనం బోల్తా పడటంతో అందులో ఉన్న యాపిల్ పండ్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. అయితే.. అక్కడ గుమికూడిన స్థానికులు.. ప్రమాదంలో చిక్కుకున్న డ్రైవర్‌ను పట్టించుకోకుండా పండ్లను ఎత్తుకెళ్లేందుకు పోటీపడ్డారు. రోడ్డుపై పడిన యాపిల్స్‌ను తీసుకునేందుకు జనం పోటీపడ్డారు. చాలా మంది వాటిని సంచుల్లో కిలోల కొద్దీ నింపుకొని వెళ్లారు. దీంతో కళ్లు మూసి తెరిచే లోపే యాపిల్ పండ్ల లోడ్ మొత్తం ఖాళీ అయిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స కోసం తరలించేందుకు చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో అక్కడున్న వారు వ్యవహరించిన తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

## నందిపంప్ హౌజ్ ద్వారా ఎత్తిపోతలు

**పెద్దపల్లి, జూలై 30 :** కాళేశ్వరం ప్రాజెక్టు అనుబంధ లింక్ -2 ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలోని నంది పంప్ హౌస్ ద్వారా గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం నుంచి ఇక్కడి పంపు హౌస్ నుంచి నీటి ఎత్తిపోతల పక్రియ మొదలుపెట్టిన విషయం తెలిసిందే. గురువారం కూడా నీటి ఎత్తిపోతలు కొనసాగాయి. 1,4,5,6 మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఒక్కో మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున మొత్తం 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసి నంది రిజర్వాయర్ లోకి ఎత్తిపోస్తున్నారు. అనంతరం అదే పరిమాణంలో నంది రిజర్వాయర్ క్రష్ గేట్ల ద్వారా జలాలు ఏడో ప్యాకేజీ జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ లోకి వెళుతుంది. ఆ పంప్ హౌస్ లోని నాలుగు బహుబలి మోటార్లను ఆన్ చేసి అక్కడ నుంచి వరద కాలువ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి నీటిని తరలిస్తున్నారు

# ప్రతిపక్షంగా విఫలం అవుతున్న కాంగ్రెస్!



**ఈ దేశ దౌర్భాగ్యం ఏమంటే అసమర్థ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడం. అధికారంలో ఉంటే అవినీతికి పాల్పడడం, కుంభకోణాలను చేయడం, పాలనను గాలికి వదిలి వేయడం చూశాం. పదేళ్ల యూపిఏ పాలనలో మన్మోహన్ సింగ్‌ను ముందుకు పెట్టి ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేం. అలాగే ప్రతిపక్షంలో గత పదేళ్లుగా నిర్మాణాత్మక పాత్ర పోషించడంలోనూ విఫలం అవుతూ వస్తోంది. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షానిదే బలమైన పాత్ర అని చెప్పాలి. దీనిని గుర్తించి నడచుకోవడంలో కూడా కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. అధికార ఎన్‌డిఏ తప్పడు పనులు చేస్తుంటే నిలదీయడం లేదు. ఆశ్రిత పక్షపాతం చూపితే నిలదీయడం లేదు.**

ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేయడం లేదు. ఎందుకంటే ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, కుటుంబ పాలన కాంగ్రెస్‌లో నరనరాన జీర్ణించుకుపోయింది. ఇంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్‌లోనే ఉన్నారు. కుటుంబ పాలనకు ఇదే నిదర్శనం. ఇకపోతే పార్లమెంట్ సమావేశాల్లో కూడా బలంగా ప్రజల వాణిని విన్పించడం లేదు. కాక్రోచ్ పార్టీకి వస్తున్న ఆదరణను తమ ఖాతాలో వేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. వారి ఉద్యమాన్ని హైజాక్ చేసి లబ్ది పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో వారుచేస్తున్న ఆందోళనలు ఎబ్బెట్టుగా ఉన్నాయి. తాజాగా పార్లమెంట్ లోపలా బయటా విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశించారో చెప్పాలన్న డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంట్ బయట ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. అందరూ గతంలో పాలన చేసిన వారే. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ అంతా పాలకులుగా ఉండివచ్చిన వారే. లాఠీ ఛార్జ్ చేయమని హోంమంత్రి ఆదేశిస్తారా అన్నది కూడా తెలియని వారు మన పాలనా వ్యవస్థలో ఉండడం దౌర్భాగ్యం. పోలీస్ మాన్యువల్ కూడా తెలియకుండా రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతున్నారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పితే పోలీసులే నిర్ణయం తీసుకుని లాఠీఛార్జ్ చేస్తారు.

నిషేధిత పార్లమెంట్ పరిసరాల్లో, ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఆందోళనలు జరిగినా తప్పకుండా కంట్రోల్ చేస్తారు. ఇదికూడా తెలియనట్లుగా ప్లకార్డులు పట్టుకుని లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలిచ్చారో చెప్పాలని నినాదాలు చేయడం సిగ్గుచేటు. ఇది కేవలం రాజకీయంగా చేస్తున్న ఆందోళన తప్ప ఇందులో చిత్తశుద్ది లేదని వారికి కూడా తెలుసు. అసలు కాంగ్రెస్ నిర్మాణాత్మకంగా వ్యవహరించి ఉంటే ఇవాళ విద్యార్థులు రోడ్డుకెక్కాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. జూన్ 6న సీజేపీ ఏర్పడడంపై వచ్చిన ప్రతిస్పందన చూసిన తర్వాతగానీ కాంగ్రెస్ గళం విప్పలేదు. మే మొదటి వారంలో పేపర్ లీక్ జరిగి, మే 12న పరీక్ష రద్దయిన తర్వాత కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందుకు చేయాల్సినన్ని ప్రయత్నాలు చేయలేదు. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోంకి గుంజ్' పేరిట విద్యార్థుల ర్యాలీని నిర్వహించిన రాహుల్‌గాంధీ ఆ తర్వాత 23 రోజుల పాటు అదృశ్యమై జర్మనీలో కాలక్షేపం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు ఢిల్లీలో ప్రవేశించి తమ ఆందోళన తీవ్రతరం చేసిన తర్వాత, పార్లమెంటు సమావేశాలు మరో మూడు రోజుల్లో జరుగుతా యనగా రాహుల్‌లో కలవరం కలిగింది. అందుకే అమాంతంగా లేచి ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు.

రాజకీయాల్లో నిరంతరత్వం, నిత్య క్రియాశీలత్వం లేకపోతే పరిస్థితి మరొకరి చేతుల్లోకి వెళుతుందన్న విషయం రుజువైంది. మునుపటిలాగా నాటకీయంగా ధర్నాలు చేయడం, అరెస్టు కావడం వల్ల ప్రజల సానుభూతి లభించదని కాంగ్రెస్ గ్రహించాలి. 2014 నుంచీ పార్లమెంట్‌ను కాంగ్రెస్ స్తంభింపజేయడం, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం వంటివి చేస్తూనే ఉన్నది. అందంతా కేవలం నాకీయ రాజకీయ ప్రయోజనం కోరి చేస్తున్నవే. కేవలం నెలరోజుల నిరసనతో కాక్రోచ్ పార్టీ ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేయగలిగింది. అటువంటి నైతిక స్థైర్యం కాంగ్రెస్, ప్రతిపక్షాలకు ఎందుకు లేకుండా పోయిందన్నదే ప్రశ్న. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికే కాదు, పరీక్షల్లో అక్రమాలను నిరోధించేం దుకు ప్రభుత్వం ఆగమేఘాలపై బిల్లు తేవడానికి, ప్రధానమంత్రి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ బిల్లు గురించి ప్రకటించడానికి సిజెపి ఉద్యమమే కారణం.

నెల రోజులకు పైగా శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తూ పరీక్షా పత్రాల లీక్‌కు విద్యామంత్రి నైతిక బాధ్యత వహించాలని కోరిన యువతీ యువకులతో దేశవ్యాప్తంగా ఎంతోమంది కనెక్టయ్యారు. నిజానికి ప్రతి ఉద్యమంలోనూ ఎంతో కొంత హింసాకాండ, విధ్వంసం జరుగుతూనే ఉన్నది. చాలాసార్లు పోలీసుల దమనకాండ అణచితేకు పోలీసులు లాఠీఛార్జ్ షరామమాలే. అంతమాత్రాన మొత్తం ఉద్యమానికి విశ్వసనీయత లేకుండాపోదు. అయితే ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం అవుతూనే ఉంది. ఇప్పుడు రాహుల్ వారిని భుజాన వేసుకుని ఊరేగే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అవమానంగా భావించనక్కర్లేదు. జరిగిన పరిణామాల్ని ఆత్మావలోకనం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు లభించిన అవకాశంగా భావించాలి. కాంగ్రెస్ ఇప్పటికైనా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలి. లేకుంటే కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానం కూడా కోల్పోతుంది.

# నిర్భయంగా పనిచేయండి..
# బాధ్యత నేను తీసుకుంటా

- విధి నిర్వహణలో భయానికి తావు లేదు
- నిజాయితీగా విధులు నిర్వహించండి
- సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర కీలక వ్యాఖ్యలు





**న్యూఢిల్లీ, జూలై 30 :** సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. విధుల్లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సిబ్బందికి సన్మానం చేసిన కార్యక్రమంలో ఆయన ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. ఎలాంటి భయం లేకుండా పనిచేయాలని బలగాలకు పిలుపునిచ్చారు. "సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్‌గా ఇక్కడ నేను మీకో హామీ ఇస్తున్నాను. విధులు నిజాయతీగా నిర్వర్తించడంలో మీరు తీసుకునే నిర్ణయాలు, చర్యలకు నేను బాధ్యత వహిస్తాను. ప్రజాప్రయోజనం కోసం తీసుకునే చర్యలకు జవాబుదారీగా వ్యవహరించాల్సి వస్తే.. దానిని నేను పూర్తిగా స్వీకరిస్తాను" అని జ్ఞానేంద్ర తన సిబ్బందిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఈ నెల 20న 'చలో పార్లమెంటు' నిరసనల సమయంలో భద్రతా విధులు నిర్వర్తించిన సీఆర్పీఎఫ్-ఆర్ఏఎఫ్ బలగాలు, పోలీసులు.. విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతోన్న వేళ.. జ్ఞానేంద్ర ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఆరోపణలపై సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ అంతకుముందు కూడా స్పందించారు. ఏదైనా భారీ ఆపరేషన్ తర్వాత తాము వృత్తిపరమైన మూల్యాంకనం చేపడతామని చెప్పారు. నిరసనకారులపై ఆర్ఏఎఫ్ సిబ్బంది తీసుకున్న చర్యల విషయంలోనూ ఆ పరిశీలన చేస్తామని తెలిపారు. అది తమ నిబంధనల్లో భాగమేనని చెప్పారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు దేశవ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర పోలీసులతో సహకరిస్తూ.. వైవిధ్య పరిస్థితులకు తగ్గట్టుగా వేగంగా స్పందించగల సామర్థ్యం వారి సొంతం. ఇక, ఏదైనా ప్రాంతంలో ఘర్షణలు, రద్దీ, అశాంతియుత పరిస్థితులను నెలకొన్నప్పుడు వాటిని నియంత్రించేందుకు సీఆర్‌పీఎఫ్‌లోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను రంగంలోకి దింపుతారు.

# ఫ్రాన్స్‌లో కార్చిచ్చు విధ్వంసం

## మంటలను ఆర్పేందుకు శ్రమిస్తున్న వేలాదిమంది సిబ్బంది



**ప్యారిస్, జూలై 30 :** ఫ్రాన్స్ నైరుతి ప్రాంతంలోని గిరోండ్ అడవుల్లో చెలరేగిన కార్చిచ్చు భారీ విధ్వంసం సృష్టిస్తోంది. ఇప్పటికే వేలాది హెక్టార్ల అడవి అగ్నికి ఆహుతి అయింది. తీవ్ర వేడి, దీర్ఘకాలిక కరువు పరిస్థితులు, బలమైన గాలులు మంటలను మరింత వేగంగా వ్యాపింపజేసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది .ఈ కార్చిచ్చు ఇప్పటివరకు పారిస్ నగర వైశాల్యానికి నాలుగు రెట్లకు సమానమైన ప్రాంతాన్ని దహనం చేసింది. లక్షలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వేలాది మంది అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల సెల్సియస్ వరకు చేరే అవకాశం ఉందని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. పొడి గాలుల కారణంగా ఇప్పటికే అదుపులోకి వచ్చిన ప్రాంతాల్లో కూడా మంటలు మళ్లీ చెలరేగవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తిరిగి ఇళ్లకు వెళ్లకుండా ఆంక్షలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం భారీ మంటలు ఫ్రాన్స్‌లోని అణు కేంద్రాలు, రఫేల్ యుద్ధ విమానాల తయారీ యూనిట్ల వైపు వేగంగా దూసుకొస్తున్నాయి. ఫ్రాన్స్ అణ్వాయుధ వ్యవస్థకు సంబంధించిన ప్రదేశాలతో పాటు, అత్యంత కీలక రక్షణ, ఏరోస్పేస్ సౌకర్యాలున్న ప్రాంతానికి కేవలం 12 కిలోమీటర్ల దూరంలో మంటలు ఉన్నాయి. మంటల వల్ల ఈ కీలక కేంద్రాలకు నష్టం జరగకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మంటలు వ్యాపించకుండా ఉండేందుకు ఈ కేంద్రాలకు సమీపంలో ఉన్న చెట్లను బుల్డోజర్లతో తొలగిస్తున్నారు.

# చైనా నుంచి ఇరాన్‌కు ఆయుధాలు

## చైనా తీరుపై ట్రంప్ అసహనం



**వాషింగ్టన్, జూలై 30 :** అమెరికా విమానాలు, హెలికాప్టర్లకు తలనొప్పిగా మారిన కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమైంది. వీటి రవాణాకు పాకిస్థాన్‌ను మార్గంగా ఎంచుకొన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దీంతో అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. పాక్ పేరు ఎత్తకుండా చైనాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించ బోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేశారు. చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకు పైగా విలువైన 400 షోల్డర్‌÷ర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం జరిగింది. వీటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే.. ఈ డీల్‌కు టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టత లేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేయడం గమనార్హం. ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు.

# మందుగుండు సామాగ్రి వివరాలు భద్రపరచండి

## పెల్లెట్ గన్ విమర్శలపై సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, జూలై 30 :** కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో నిరసన చేపట్టిన విద్యార్థులపైకి భద్రతా బలగాలు పెల్లెట్ గన్స్ వినియోగించారంటూ తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో దాఖలైన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు గురువారం సుముఖత వ్యక్తంచేసింది. అసాధారణ పరిస్థితుల్లో పెల్లెట్ గన్స్ వాడటాన్ని పోలీసు నిబంధనలు అనుమతిస్తున్నాయని పేర్కొంది. అదే సమయంలో ఇటీవలి ఆందోళనలో పోలీసులు వాడిన మందుగుండు సామగ్రి లాగ్ రికార్డులను భద్రపరచాలని కేంద్రాన్ని ఆదేశించింది. పెల్లెట్ల కారణంగా గాయపడిన వారికి చికిత్స అందేలా చూడాలని దిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిరసనల్లో భాగంగా సీఆర్‌పీఎఫ్‌కు చెందిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ లోహపు పెల్లెట్లు వాడిందని, గాయపడిన ఆందోళనకారుల శరీరం నుంచి వైద్యులు వాటిని తొలగించారని పిటిషనర్లు పేర్కొన్నారు. "ఆర్ఏఎఫ్ సిబ్బంది పెల్లెట్ గన్స్ వాడకూడదని మేం చెప్పడం లేదు. కానీ ఇక్కడ పరిస్థితి వేరు. వారు లోహపు పెల్లెట్లు వాడారు. వాటిని నిషేధించాలి" అని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. పెల్లెట్ గన్స్ వాడే విషయంలో ఉన్న నిబంధనలు పరిశీలించకుండా వాటిని నిషేధించాలనే అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేమని న్యాయస్థానం పేర్కొంది.

# కంగనాకు అంత కోపం పనికిరాదు

## యువతను విమర్శించడం సిరకాదన్న సౌరవ్

**న్యూఢిల్లీ,జూలై30 :** భాజపా ఎంపీ, నటి కంగనా రనౌత్ తనపై చేసిన విమర్శలపై కాక్రోజ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ ఘాటుగా స్పందించారు. తనను పనికిరాని వాడు, నిరుద్యోగి అని పిలవడాన్ని తప్పుపట్టారు. గూగుల్‌లో సెర్చ్ చేస్తే ఇలాంటి తప్పుడు సమాచారమే వస్తుందని అన్నారు. ఓ ఇంటర్వ్యూలో సౌరవ్ మాట్లాడుతూ.. ఆమె ఈ దేశ భవిష్యత్ తరాలను, యువతను తీవ్రంగా విమర్శిస్తున్నారని అన్నారు. కంగనా నా వ్యాఖ్యలపై ఎందుకు అంతగా స్పందించారో అర్థం కావడం లేదు. ఇదే మాట నా స్నేహితులు కూడా అంటున్నారు. 'ఆమెకు నువ్వు చిన్నప్పటి హృతిక్ రోషన్ లాగా కనిపిస్తున్నావేమో' అని నా ఫ్రెండ్ మెసేజ్ చేశాడు. అది నిజమేనా? నా స్నేహితులు ఇలా అనడంతో నేను చాలా ఆశ్చర్యపోయాను అని వ్యంగ్యంగా సమాధానమిచ్చారు. అయితే, తనకు కంగనాపై వ్యక్తిగత ద్వేషం లేదని సౌరవ్ స్పష్టం చేశారు. ఆమెతో గొడవ పడాల్సిన అవసరం నాకు లేదు. విభేదాలు ఏవైనా ఉంటే చర్చించి పరిష్కరించుకోవాలి. ఈ రోజు నా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలోనూ ఇదే పోస్ట్ చేశాను. 'కంగనా.. కాస్త ప్రశాంతంగా ఉండండి.. మాట్లాడుకుందాం' అని క్యాప్షన్ పెట్టా. దేశంలో చర్చలు, సంభాషణలు తగ్గిపోవడం పెద్ద సమస్యగా మారింది. పరస్పర గౌరవంతో చర్చించుకునే వాతావరణం ఉండాలని సౌరవ్ అన్నారు. అలాగే కంగనా తన వ్యాఖ్యలను పునఃసమీక్షించుకోవాలని హితవు పలికారు. తనతో మాట్లాడాలంటే కంగనా డైరెక్ట్‌గా ఫోన్ చేయొచ్చని.. ఆమెతో సంభాషించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని సౌరవ్ తెలిపారు.



# హిందుత్వ అంటే మన జీవనవిధానం

## మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్య

**విజయవాడ, జూలై 30 :** హిందుత్వం అంటే మతం కాదని.. జీవన విధానమని భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. దేశభక్తి సమాజ ఐక్యత లోపిస్తే దేశం వెనకపడుతుందని పేర్కొన్నారు. గురువారం కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 'కర్మవీరులారా కదిలి రండి' గీతం ఆవిష్కరణ, విద్యార్థులతో మాటామంతిలో పాల్గొని వెంకయ్యనాయుడు ప్రసంగించారు. మంచి గీతాలు వినాలని, తద్వారా స్ఫూర్తిని పొందాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వందేమాతరం గీతం మనందరికీ సమాధానమని తెలిపారు. అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని సూచించారు. శక్తివంతమైన భారత్ కావాలంటే యువతి, యువకుల పాత్రే కీలకమని ఉద్ఘాటించారు. మొబైల్ ఫోన్, యూట్యూబ్‌లపై యువత ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని చెప్పుకొచ్చారు. యువత మంచి గురువును ఎంచుకోవాలని, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను ఎక్కువగా చదవాలని సూచించారు. యువత తమ భవిష్యత్తును తామే నిర్దేశించుకునే స్థాయికి ఎదగాలని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# నారాయణపురం ఆనకట్టకు భారీగా వరద నీరు

**శ్రీకాకుళం, జూలై 30 :** శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం లాభాం పంచాయతీ వద్ద నారాయణపురం అనకట్టకు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. నాగావళి నదిపై నిర్మించిన నారాయణపురం అనకట్ట జిల్లాలోని ప్రధాన నీటివనరుల్లో ఒకటి కావడంతో దీనిపై రైతులు ఆధార పడి వ్యవసాయం చేస్తుంటారు. ఒడిశాలో వర్షాలు కార ణంగా అనకట్ట వద్దకు భారీగా వరదనీరు చేరుతోంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో అనకట్టకు సుమారు 1000 క్యూసెక్కుల నీరు చేరడం రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని ఏడు మండలాల్లో 37,053 ఎకరాలకు కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా నీరు అందుతుందని జలవనరుల శాఖ ఏఈ రామశివాజీ తెలిపారు.

# భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ

## ఉద్యోగులకు అలర్ట్ జారీ చేసిన ట్రాఫిక్ పోలీసులు

**హైదరాబాద్,జూలై30:** తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక సూచనలు జారీ చేశారు. నగరంలోని కంపెనీలు, సంస్థలు సాధ్యమైన చోట వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు చేయాలని సూచించారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉద్యోగులకు విడతల వారీగా ముందస్తు లాగౌట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా చూడడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రయాణ ప్రమాదాలు తగ్గించి, రహదారులపై ట్రాఫిక్‌ను నియంత్రించే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు. సంస్థలు తమ కార్యాలయ స్థానం, ముందస్తు లాగౌట్ సమయాలను ట్రాఫిక్ పోలీసులకు ఈ-మెయిల్ ద్వారా తెలియజేయాలని సూచించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని, వర్షం పడుతున్నప్పుడు జాగ్రత్తగా ప్రయాణించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.



## ఘట్కేసర్ తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**మేడ్చల్ :** సాదాబైనామా, భూ భారతి పెండింగ్ అప్లికేషన్లు, గ్రామాల రీసర్వే, ఎలక్ట్రోల్ ఎన్రోల్మెంట్ (సర్) ప్రక్రియను మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గురువారం అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి జిల్లాలోని ఘట్కేసర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సాదా బైనామా, భూ భారతి పెండింగ్ అప్లికేషన్లను, గ్రామాల రీసర్వే, ఎలక్ట్రోల్ ఎన్రోల్మెంట్ (సర్) పరిశీలించి పెండెన్సినీ త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దారును ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూమి రికార్డుల సమగ్ర పోర్టల్ భూభారతి లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి చేశారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పెండెన్సికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సాదా బైనామా, భూభారతి రికార్డులను అదనపు కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. సర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ తహసీల్దారు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## తుని, కాపవరం ప్రాంతాల్లో రోడ్ అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకోండి

### కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ వినతి



**కాకినాడ :** కాకినాడ జిల్లా ప్రజల భద్రత, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తుని రైల్వే స్టేషన్ యార్డు వద్ద మరియు సామర్లకోట సమీప కాపవరం గ్రామం వద్ద రోడ్ అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి తక్షణ చర్యలు తీసుకొని ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన గురువారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు లేఖ రాశారు. తుని రైల్వే స్టేషన్ యార్డులో ప్రస్తుతం ఉన్న ఇరుకైన కల్వర్టును ప్రతిరోజూ 40 వేల మందికి పైగా ప్రజలు వినియోగిస్తున్నారని ఎంపీ తెలిపారు. ఈ మార్గంలో రోజురోజుకీ పెరుగుతున్న రాకపోకల వల్ల తీవ్ర ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు రైల్వే పట్టాలు దాటి ప్రయాణించాల్సి వస్తోందని, అత్యవసర వైద్య పరిస్థితుల్లో అంబులెన్సులు దాదాపు నాలుగు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోందని వివరించారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు తునిలో రోడ్ అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం గడిచిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ గుర్తు చేశారు. అలాగే సామర్లకోట మండలంలోని కాపవరం గ్రామ ప్రజలు, రైతులు కూడా రోడ్ అండర్ బ్రిడ్జి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నారు. సుమారు 2 వేల మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో 1,200 ఎకరాల వ్యవసాయ భూములు రైల్వే మార్గానికి ఇరువైపులా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువులు, విత్తనాల రవాణా కోసం ఉన్న చిన్న వంతెనను వినియోగించాల్సి రావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాపవరం గ్రామ ప్రజలు విద్య, వైద్యం, రెవెన్యూ తదితర ప్రభుత్వ సేవల కోసం సామర్లకోటకు వెళ్లాల్సి వస్తోందని, సరైన క్రాసింగ్ లేక దాదాపు 11 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోందని ఎంపీ వివరించారు. ప్రతిపాదిత రోడ్ అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఈ దూరం 3.5 నుంచి 4 కిలోమీటర్లకు తగ్గి ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. వర్షాలు, తుఫానుల సమయంలో ప్రస్తుతం ఉన్న మార్గంలో రాకపోకలు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయని, రైల్వే శాఖ చేపడుతున్న ఫెన్సింగ్ పనుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గం లేకుంటే రైతులు, గ్రామస్థుల రాకపోకలు పూర్తిగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వే లైన్ నిర్మాణానికి భూముల సేకరణ సమయంలో స్థానిక రైతులు పూర్తిస్థాయిలో సహకరించిన విషయాన్ని కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల భద్రత ను దృష్టిలో ఉంచుకొని తుని, కాపవరం ప్రాంతాల్లో ప్రతిపాదిత రోడ్ అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను కోరారు.



## గాంధీ ఆస్పత్రిని సందర్శించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

- రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా
- ప్రభుత్వ ఆస్పత్రుల సేవలు మెరుగయ్యాయని వ్యాఖ్య

**సికింద్రాబాద్ :** కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గురువారం గాంధీ ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రిలోని వివిధ వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది స్పందన తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు, అధికారులతో కూడా సమావేశమై ఆస్పత్రిలో అందిస్తున్న సేవలు, మౌలిక సదుపాయాలు, రోగుల అవసరాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు మరింత మెరుగుపడ్డాయని అన్నారు. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది నియామకాలు పెద్ద ఎత్తున చేపట్టడం తో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురు రోగులు కూడా వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరచాలని అధికారులకు సూచించారు.

# ఈదులకుంట చెరువును రక్షించండి..

# వరద నీటితో నింపండి

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు సీపీఎం నాయకులు వినతి



**శేరిలింగంపల్లి, జూలై 30 (జనం వార్త):** శేరిలింగంపల్లి మండలం పరిధిలోని కానామెట్ గ్రామంలోని ఈదులకుంట చెరువును వెంటనే వరద నీటితో నింపి రక్షించాలని సీపీఎం నాయకులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈదులకుంట చెరువును కొందరు కబ్జాదారులు ఉద్దేశపూర్వకంగా నీరు లేకుండా చేసి, కూకట్పల్లి సర్వే నంబర్ పేరుతో భారీ నిర్మాణాలకు ప్రయత్నిస్తున్నారని సీపీఎం నాయకులు ఆరోపించారు. చెరువు పరిరక్షణ కోసం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించి, రెవెన్యూ, ఇరిగేషన్, అగ్రికల్చర్, హైడ్రా అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. చివరకు స్థానిక ఎమ్మెల్యే చెరువు ఉనికిని అధికారికంగా నిర్ధారించారని, హైడ్రా అధికారులు కూడా చెరువు రక్షణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే ఈ అంశంపై జాతీయ పరిశోధన ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)లో ఫిర్యాదు చేయగా, రెవెన్యూ, ఇరిగేషన్, హైడ్రా శాఖలు చెరువు పరిరక్షణ చర్యలు చేపట్టాలని తెలియజేశారని వివరించారు. ఖానామెట్ తుమ్మిడికుంట నుంచి భారీగా వచ్చే వరద నీటిని ఈదులకుంటలోకి చేరకుండా కబ్జాదారులు అక్రమంగా మళ్లించారని ఆరోపించారు. దీంతో చెరువు జలప్రవాహం దెబ్బతిని, పర్యావరణం, భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు. మాదాపూర్, కానామెట్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటిపోయే స్థితి ఏర్పడి తీవ్రంగా ఉందని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వరద నీటితో ఈదులకుంట చెరువును నింపితే భూగర్భ జలాలు పెరిగి పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఆర్టీసీ వోలం సీపీఎం చేసిన నివేదికలో కూడా ఈదులకుంట చెరువు స్పష్టంగా గుర్తించబడిన నేపథ్యంలో, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే చెరువును వరద నీటితో నింపి పరిరక్షించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఎం శేరిలింగంపల్లి జోన్ కార్యదర్శి చల్లా శోభన్, జోన్ కార్యవర్గ సభ్యులు వి. మాణిక్యం, కె. కృష్ణ, ఎస్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాయదుర్గంలో నిర్మాణ కార్మికులకు నమోదు కార్డులు

### సైబరాబాద్ పోలీసులు, కార్మిక శాఖ సంయుక్తంగా అవగాహన కార్యక్రమం





**సైబరాబాద్, జూలై 30 (జనం వార్త):** సైబరాబాద్ కమిషనరేట్ రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో, తెలంగాణ కార్మిక శాఖ సహకారంతో నేడు నిర్మాణ కార్మికుల నమోదు కార్డుల పంపిణీ, సంక్షేమ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 250 మంది అర్హులైన నిర్మాణ కార్మికులకు బీఓసీడబ్ల్యూ నమోదు కార్డులు పంపిణీ చేశారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలైన ఈఎస్ఐ, ఈపీఎఫ్, బీమా, వివాహ, ప్రసూతి, ప్రమాద మరణ, వైకల్య, ఆసుపత్రి సహాయం, నైపుణ్య శిక్షణ, ఉచిత ఆరోగ్య పరీక్షలపై అవగాహన కల్పించారు. బిల్డర్లు, కాంట్రాక్టర్లు తమ వద్దని అర్హులైన కార్మికులందరినీ తప్పనిసరిగా నమోదు చేయించాలని అధికారులు సూచించారు. బిల్డర్లు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేశ్ రెడ్డి ఐపీఎస్, కూకట్‌పల్లి జోన్ డిసీపీ రీతిరాజ్ ఐపీఎస్, సిఎంసీ సేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, అదనపు డిసీపీ ఎం. సుదర్శన్, మాధాపూర్ ఏసీపీ శ్రీధర్, ఎఎల్‌వోలు వినీల, రేణుక, రాయదుర్గం ఎస్‌ఐలు పాల్గొన్నారు.



## బోయిన్‌పల్లి వెంకటేశ్వరస్వామికి నూతన పల్లకి

- గోదాదేవికి రూ.8 లక్షల బంగారు కిరీటం బహూకరణ
- వైభవంగా శ్రీ లక్ష్మీ-గోదాదేవి సమేత కల్యాణోత్సవం
- అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన జంపన ప్రతాప్

**సికింద్రాబాద్ :** చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందిన బోయిన్‌పల్లి న్యూ సిటీ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం శ్రీలక్ష్మీదేవి, గోదాదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణి స్వామి ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ దివ్యోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భక్తులు సుమంత్ రెడ్డి--శిరీష దంపతులు నూతనంగా తయారు చేయించిన పల్లకిని ఆలయానికి అందజేశారు. అలాగే అమెరికాకు చెందిన వి.వి. నాగరాజు--శ్రీవాణి దంపతులు గోదాదేవి ఉత్సవ విగ్రహానికి రూ.8 లక్షల విలువైన బంగారు కిరీటాన్ని భక్తిశ్రద్ధలతో బహూకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ దాతల నుంచి బంగారు కిరీటాన్ని స్వీకరించి ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. అనంతరం దాతలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ, గతంలో కూడా వి.వి. నాగరాజు--శ్రీవాణి దంపతులు స్వామివారికి, శ్రీలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాలకు సుమారు రూ.20 లక్షల విలువైన బంగారు కిరీటాలను సమర్పించారని గుర్తు చేశారు. ఆలయ కమిటీ విజ్ఞప్తి మేరకు గోదాదేవి అమ్మవారికి కూడా రూ.8 లక్షల విలువైన బంగారు కిరీటాన్ని బహూకరించడం అభినందనీయమని కొనియాడారు. హిందూ సనాతన ధర్మ పరిరక్షణలో ప్రతి భక్తుడు భాగస్వామి కావాలని, ఆలయాల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బానుక నర్మద, ఎమ్మెల్యే మల్లారెడ్డి సతీమణి కల్పనా రెడ్డి, జంపన్న విద్యావతి, టీంకు గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు హర గోపాల్, నారాయణ, లక్ష్మణ్, ఆత్మానంద రెడ్డి, జగన్నాథం, సుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలయ్య ఆచూకీ కోసం

# రెండో రోజూ గాలింపు

### భద్రతా చర్యలు పెంచాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్



**శేరిలింగంపల్లి, జూలై 30 (జనం వార్త):** మియాపూర్ హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలి నగర్ నారాయణ ఎస్టేట్స్ సమీపంలో ఓపెన్ నాలాలో పడి గల్లంతైన బాలయ్య ఆచూకీ రెండు రోజులైనా లభించకపోవడం పట్ల తెలంగాణ రక్షణ సేన నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి తెరాస పార్టీ ఇన్‌చార్జి వాసిలి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు తెలంగాణ రక్షణ సేన నాయకులు ఘటనా స్థలికి చేరుకుని గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటన అనంతరం నిరంతరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నప్పటికీ బాలయ్య ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గల్లంతైన వ్యక్తిని గుర్తించేందుకు సంబంధిత శాఖలు మరింత సమన్వయంతో చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన నాయకులు మాట్లాడుతూ నగరంలో వర్షాకాలంలో ప్రమాదాలకు కారణమవుతున్న ఓపెన్ నాలాలు, రక్షణ గోడలు లేని డ్రైనేజీలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఓపెన్ నాలాలను మూసివేయడం, ప్రమాదకర ప్రాంతాల్లో రక్షణ కంచెలు ఏర్పాటు చేయడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలను అత్యవసరంగా అమలు చేయాలని కోరారు. గల్లంతైన బాలయ్య కోసం గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ చారి, షేక్ అస్లాం, మురుగేషన్, సలాం తదితరులు పాల్గొన్నారు.

## వాట్సాప్ గ్రూపుల సహకారంతో తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ




**ఉప్పల్ :** కుషాయిగూడలోని విస్టా హోమ్స్ నుంచి తప్పిపోయిన భృందావన్ సాహోను కుషాయిగూడ పోలీసులు సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం అదృశ్యమైన భృందావన్ సాహో ఫోటో, వివరాలను వివిధ కాలనీల వాట్సాప్ గ్రూపులు, సహచరి గ్రూపుల్లో ప్రచారం చేశారు. అనంతరం సాంకేతిక ఆధారాలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా అందిన సమాచారం ఆధారంగా దమ్మాయిగూడ పరిధిలో దారితప్పి తిరుగుతున్న అతడిని గుర్తించి సురక్షితంగా అదుపులోకి తీసుకున్నారు. తదుపరి కుటుంబ సభ్యులను పిలిపించి భృందావన్ సాహోను క్షేమంగా వారికి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.



## రోడ్లపై చెత్త వేస్తే.. జరిమానా తప్పదు!

- తడి, పొడి, శానిటరీ, హానికర వ్యర్థాలపై ఇంటింటికీ అవగాహన
- ప్లాస్టిక్ రహిత గ్రామమే లక్ష్యం: సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్

**దేవరుప్పుల :** పచ్చదనం, పరిశుభ్రతే ప్రధాన లక్ష్యంగా దేవరుప్పుల గ్రామ పంచాయతీ నడుంబిగించింది. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్లాస్టిక్ రహిత గ్రామ సాధనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ గ్రామాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించి రోడ్లపై, కాలువల్లో చెత్తను పారబోసినా లేదా బహిరంగంగా కాల్చివేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, భారీ జరిమానాలు విధిస్తామని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లో పారిశుధ్య మెరుగుదలకు ఇంటింటి చెత్త సేకరణే సరైన మార్గమని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని సర్పంచ్ పేర్కొన్నారు. పంచాయతీ ట్రాక్టర్లు వచ్చినప్పుడు ఇళ్ల వద్దే వ్యర్థాలను నాలుగు రకాలుగా వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని విజ్ఞప్తి చేశారు. అలా వేరుచేయని చెత్తను సిబ్బంది స్వీకరించరని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా నాలుగు చెత్త డబ్బాల వినియోగంపై ఆయన సమగ్రంగా వివరించారు. మిగిలిన ఆహారం, ఆకులు, పూజా వ్యర్థాలు, కూరగాయల తొక్కలు, టీ పొడి, గుడ్డు పెంకులు వంటి తడి చెత్తను ఆకుపచ్చ డబ్బాలో వేయాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు, గాజు పెంకులు, పేపర్లు, అట్టముక్కలు, కూల్ డ్రింక్ టిన్లు, ఇనుప సామాన్లు తదితర పొడి చెత్త కోసం నీలం రంగు డబ్బాను ఉపయోగించాలన్నారు. ఆరోగ్యపరంగా ముప్పు కలిగించే వ్యర్థాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అవగాహన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్, పారిశుధ్య కార్మికులు, స్థానిక ప్రజలు విశేషంగా పాల్గొన్నారు.



# పవన్‌తో మంత్రి నిమ్మల భేటీ

## ఎల్‌నినోపై ఇరు నేతల చర్చ

### ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలన్న పవన్

**అమరావతి, జూలై 30 :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం భేటీ అయ్యారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై చర్చించారు. సూపర్ ఎల్‌నినో, తద్వారా రాష్ట్రంలో నెలకొన్న సాగు నీటి సంక్షోభంపై రైతుల్లో అవగాహన కల్పించాలని పవన్ సూచించారు. రైతులతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించి పరిస్థితులను వివరించాలన్నారు. సంక్షోభ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణపై దృష్టి సారించాలని అన్నారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు నిమ్మలకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. నీటి విడుదలతో పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట రైతులకు సాగునీటి సమస్యకు ఊరట లభించిందని పవన్ అన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంపై గ్రామస్థాయిలో ప్రచారం చేపట్టాలని సూచించారు. ప్రతి రైతు పీఎం ఫసల్ బీమా యోజనలో చేరేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం ప్రతి నీటి బొట్టు విలువైనదే అని... నీటి వృథాను అరికట్టాలని చెప్పారు. కాలువల్లో పూడిక తొలగింపు, నీటి గట్టుల లీకేజీల నివారణపై దృష్టి సారించాలన్నారు. కాకినాడ జిల్లా, పిఠాపురంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా భుజం శస్త్రచికిత్స చేయించుకున్న పవన్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శించారు. త్వరగా కోలుకుని ప్రజాసేవలో మరింత చురుగ్గా పాల్గొనాలని నిమ్మల ఆకాంక్షించారు.




# పంపులను ఆన్ చేసి జలాశయాలను నింపాలి

## రిజర్వాయర్‌లను నింపాలనే సోయి రాకపోతే ఎలా

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాసగౌడ్

**హైదరాబాద్, జూలై 30 :** గోదావరి, కృష్ణా నదుల ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతోంది. కానీ ప్రాజెక్టులలోని అన్ని పంపులను ఆన్ చేసి, రిజర్వాయర్లను నింపుకోవాలనే సోయి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూరాల నుంచి కిందున్న అన్ని రిజర్వాయర్లు, అన్ని పంప్‌సెట్లు ఆన్ చేసుకోవాలి.. అన్ని రిజర్వాయర్లు నింపుకోవాలి.. తాగునీటి అవసరాలకు మాత్రమే మేం నీళ్లిస్తాం.. వ్యవసాయానికి నీళ్లివ్వం అనే ధోరణిలో అధికారులు మాట్లాడుతున్నారు. దాదాపు నిన్న 45-50 వేల క్యూసెక్కుల పవర్ జనరేషన్ పేరు మీద నీళ్లు వదులుతున్నరు.. కానీ ఉన్న రిజర్వాయర్లను నింపాలి.. పంపులు ఆన్ చేయాలనేది మాత్రం విస్మరించారని అన్నారు. గోదావరి, కృష్ణా నదుల ఎగువన కురుస్తున్న వర్షాలతో భారీగా వరద వచ్చి చేరుతోంది. కొన్ని పంపులు ఆన్ చేశారు.. మరికొన్ని చేయలేదన్నారు. నీళ్లు వచ్చినప్పుడు ఒడిసి పట్టుకోవాలి కానీ వదలన్నీ బంద్ అయినప్పుడు ఏం చేస్తరని ప్రశ్నించారు. వరదలు వచ్చి జూరాల నిండుతున్నా పంపులు ఆన్ చేయలేదన్నారు. రైతులంతా ధర్నా చేస్తం.. మేమే ఆన్ చేసుకుంటమని ధర్నా చేస్తే నిన్న ఆన్ చేశారు. ఇన్‌ఎ÷-లో ఎంత ఉందో అవుట్ ఎ÷-లో కూడా అంతే పవర్ జనరేషన్ పేరు మీద మొత్తం కింది వెళ్లిపోతున్నయన్నారు. ఎల్ నినో దృష్ట్యా గోదావరి, కృష్ణా నదుల నుండి కిందకి వృథాగా పోతున్న ప్రతి చుక్కను ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఉంది. సరైన సమయంలో స్పందించకపోతే పాలమూరు ఎడారి కాక తప్పదని అధికారులు, ప్రభుత్వానికి హెచ్చరించారు.



# త్వరగా భద్రకాళి బండ్ పనులు పూర్తి చేయాలి

## అధికారులకు కమిషనర్ ఆదేశాలు

**వరంగల్, జూలై 30 :** భద్రకాళి బండ్‌పై పెండింగ్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. గురువారం నగర పరిధిలోని భద్రకాళి, వడ్డేపల్లి బండ్ లను క్షేత్ర స్థాయిలో సందర్శించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొన్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా భద్రకాళి బండ్ పై పూర్తి చేసిన పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ త్వరితగతిగా బండ్‌పై మిగిలిపోయిన పెండింగ్ పనులను ఆగస్టులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. భద్రకాళి బండ్, వడ్డేపల్లి బండ్‌పై హార్టికల్చర్‌కు సంబంధించి గ్రీనరీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, కమిషనర్ వెంట పర్యవేక్షక ఇంజనీర్ రాజ్ కుమార్, హార్టికల్చర్ అధికారి లక్ష్మిరెడ్డి, డీఈ రాజ్ కుమార్, ఏఈ హరికుమార్ ఉన్నారు.

# సిదిరితో జగన్ ములాఖత్ రద్దు

## సాయంత్రం 5 తరువాత జైలు వద్దకు జగన్

## నిబంధనల మేరకు ములాఖత్ కుదరదని తేల్చిన సిబ్బంది



**శ్రీకాకుళం,జూలై30 :** వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో వైఎస్ జగన్ ములాఖత్‌కు జైలు అధికారులు అనుమతి నిరాకరించారు. నిర్ణయించిన సమయం ముగిసిన తర్వాత జైలు వద్దకు చేరుకోవడంతో, జైలు నిబంధనల ప్రకారం అధికారులు అనుమతి ఇవ్వలేదు. సాయంత్రం 5 గంటల తర్వాత సీదిరి అప్పలరాజును కలిసేందుకు వైసీపీ నేతలు అనుమతి కోరారు. ఈ విషయంపై జైలర్.. ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరపగా, జైలు నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని అధికారులు స్పష్టం చేశారు. సాయంత్రం 5 గంటలలోపే ములాఖత్‌కు అనుమతి ఉంటుందని తెలిపారు. దీంతో జగన్ అప్పలరాజు ములాఖత్‌కు అనుమతి లభించలేదు. ఇకచేసేది లేక జైలు వద్ద అప్పలరాజు కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు. అంతకుముందు విశ్వాఖ చేరుకున్న జగన్ అక్కడి నుంచి రోడ్డు మార్గంలో శ్రీకాకుళం చేరుకున్నారు. ప్రస్తుతం అంపోలు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ఆయన జైలులో ములాఖత్ ద్వారా పరామర్శించాలనుకున్నారు. ఎన్నికల అనంతరం జగన్ శ్రీకాకుళం జిల్లాకు రావడం ఇదే తొలిసారి కావడంతో వైసీపీ శ్రేణులు ఈ పర్యటనకు ప్రాధాన్యం ఇచ్చాయి. సీదిరి అప్పలరాజు కుమారుడు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనలో, కుమారుడిని కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై పోలీసులు అప్పలరాజును అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జగన్ ఆయనను పరామర్శించడానికి ఇక్కడికి చేరుకున్నారు. భోగాపురం, పూసపాటిరేగ, పైడి భీమవరం, రణస్థలం, ఎచ్చెర్ల మీదుగా అంపోలు జిల్లా జైలుకు చేరుకుని మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు అప్పలరాజుతో ములాఖత్ నిర్వహించాలనుకున్నారు. అయితే, వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో ఆంక్షలు విధించారు పోలీసులు.. జైలు వద్ద ములాఖత్‌కు మాత్రమే పోలీసులు అనుమతి ఇచ్చారు. ర్యాలీలు, భారీ జనసమీకరణకు అనుమతి లేదని శ్రీకాకుళం పోలీసులు స్పష్టం చేశారు.

# ఎన్నికల్లో గెలవకుండా మంత్రిగా ఇంకెంతకాలం?

- వరుసగా రెండుసార్లు మంత్రిగా కొనసాగడం సరికాదు
- బీహార్ మంత్రి దీపక్ ప్రకాశ్‌ను ఉద్దేశించి సుప్రీం వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,జూలై30 :** ఎన్నికల్లో గెలవని వ్యక్తిని ఇంకెంతకాలం మంత్రిగా కొనసాగిస్తారని బిహార్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఆ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దీపక్ ప్రకాశ్‌ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసింది. ఆరు నెలల గడువు ముగిసిన తర్వాత కూడా ఆ పదవిలో కొనసాగించడంపై సమాధానం చెప్పాలని సమ్రాట్ చౌధరీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. సాధారణంగా ఎన్నికల్లో గెలవని వ్యక్తులు రాష్ట్ర మంత్రిగా నియమితులైతే.. వారు ఆరునెలల్లోగా ఏదో ఒక నియోజకవర్గం నుంచి గెలివాల్సి ఉంటుంది. లేదా శాసనమండలి సభ్యుడిగానైనా ఎన్నిక కావాలి. కానీ దీపక్ ప్రకాశ్ 2025 నవంబర్‌లో పంచాయతీ రాజ్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. తొలుత ఏప్రిల్ 25, 2026 వరకు మంత్రిగా కొనసాగారు. అప్పుడు నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో క్యాబినెట్ మొత్తం రద్దయింది. తర్వాత సమ్రాట్ చౌధరీ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయగా.. దీపక్ మళ్లీ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మధ్యలో 22 రోజులు ఏ పదవిలో లేరు. అంటే నిరవధికంగా ఆరునెలల పాటు దీపక్ మంత్రిత్వ బాధ్యతల్లో లేనట్లయ్యింది. సాధారణంగా ఆరు నెలల్లోపు శాసనసభకు ఎన్నిక కాకపోతే.. మంత్రి పదవిని కోల్పోతారు. కానీ ఇక్కడ ఒకే మంత్రి విషయంలో ఆరు నెలల గడువును రెండుసార్లు వినియోగించడం ప్రస్తుతం వివాదాస్పదమవుతోంది. దీపక్ ఎన్నికల్లో గెలవకపోయినా ఆయనను రెండోసారి మంత్రిగా నియమించడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇది రాజ్యాంగాన్ని మోసం చేయడమే అవుతుందని, మంత్రి పదవి కేటాయింపు చెల్లనిదిగా ప్రకటించాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇది చట్టాన్ని ప్రశ్నించడమే అవుతుంది. ఎన్నిక కాకుండా ఒక మంత్రిని ఆరునెలలకు పైగా ఎలా కొనసాగిస్తున్నారనే దానిపై సమాధానం ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానం బిహార్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే తదుపరి విచారణను ఆగస్టు 4కు వాయిదావేసింది. ఇదిలా ఉంటే.. ప్రమాణ స్వీకారం సమయంలో కూడా దీపక్ వార్తల్లో నిలిచారు. ప్రముఖ రాజకీయ నాయకులంతా కుర్తా, పైజామా, ధోవతీలతో రాగా.. దీపక్ మాత్రం చాలా డిఫరెంట్‌లుక్‌లో కనిపించి, అప్పట్లో అందరి దృష్టిని ఆకర్షించారు. క్యాజువల్ షర్ట్, ప్యాంట్ ధరించిన ఆయన.. అదే వేదికపై ఉన్న ప్రధాని మోదీని కలిశారు. రాష్ట్రీయ లోక్ మోర్చా చీఫ్ ఉపేంద్ర కుశ్వాహా కుమారుడే ఈ దీపక్. ఆయన తల్లి ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

# గోదావరి పరివాహకంలో అప్రమత్తంగా ఉండండి

## వర్షాల నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్

**జగిత్యాల, జూలై 30 :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి పరీవాహక మండలాల్లో అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, గోదావరి నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైతే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. గురువారం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించి వర్షాల పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు తమ పరిధిలోని పునరావాస కేంద్రాలను తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఆహారం, వైద్య సదుపాయాలతో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడితే వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, నాలాలు ఎక్కడా మూసుకుపోకుండా వెంటనే శుభ్రపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారులపై చెట్లు విరిగి పడితే వెంటనే తొలగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల్లో నీటిముంపు సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత భవనాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తాగునీటి బృందాలు, ఎమ్జగ్గ÷న్సీ రెస్పాన్స్ బృందాలు, యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో 24 గంటలు పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. వర్షాల కారణంగా ప్రమాదాలు, నీటి ముంపు, ఆస్తి నష్టం లేదా ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, తీసుకున్న చర్యలను జిల్లా కంట్రోల్ రూమ్‌కు వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్లు బి. రాజ గౌడ్, బి.ఎస్. లత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ఆగస్టు 18న ఏఐటియుసి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళన

**ఏలూరు, జూలై 30 :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 18వ తేదీన ఏ ఐ టి యు సి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాలలో ఏలూరు జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యోగులు, కార్మికులు పాల్గొనాలని ఏ ఐ టి యు సి రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమ సుందర్ పిలుపునిచ్చారు. గురువారం నాడు స్థానిక స్ఫూర్తి భవనంలో ఏఐటియుసి ఏలూరు జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు తొర్లపాటి బాబు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డి.సోమ సుందర్ మాట్లాడుతూ ఏ ఐ టి యు సి రాష్ట్ర సమితి నిర్ణయాలను వివరిస్తూ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక మరియు ప్రైవేటీకరణ విధానాలను దుయ్యబట్టారు. 105 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏఐటియుసి సాధించిన 44 కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు కార్మిక కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చి అమలు చేయుటకు పూనుకున్నదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10 న దేశవ్యాప్తంగా తలపెట్టిన సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలలో ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాలు పాల్గొనాలని ఆయన కోరారు. ఏలూరు జిల్లాలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐటియుసి జిల్లా నాయకత్వం క్రియాశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని సోమ సుందర్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీని సంస్థాగతంగా నిర్మాణం చేపట్టుటకు కృషి చేయాలన్నారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ జిల్లాలో ఏఐటీయూసీ నిర్మాణానికి, దాని కార్యక్రమాలకి పార్టీ పరంగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

# పాకిస్థాన్ కశ్మీర్ అంటూ ఏమీలేదు.. పాక్ ఆక్రమిత కశ్మీర్ మాత్రమే: భారత్

**న్యూయార్క్:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో జరుగుతోన్న ఘర్షణలను ప్రస్తావిస్తూ అమెరికా మీడియా సంస్థ 'న్యూయార్క్ టైమ్స్' రాసిన కథనం వివాదానికి దారితీసింది. "స్థానిక ఎన్నికలు ప్రారంభం కాగానే పాకిస్థాన్ కశ్మీర్‌లో ఘర్షణలు చెలరేగాయి" అంటూ ఆ కథనానికి శీర్షిక పెట్టింది. దీనిపై అమెరికాలోని భారత రాయబార కార్యాలయం తీవ్రంగా స్పందించింది. అందులో ప్రస్తావించిన పేర్లను ఖండించింది. "అది తప్పుదోవ పట్టించే శీర్షిక. పాకిస్థాన్ కశ్మీర్ అంటూ ఏదీ లేదు. పాక్ ఆక్రమిత కశ్మీర్ మాత్రమే. కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ఎల్లప్పుడూ భారత్‌లో అంతర్భాగమే. వీటిలోని కొన్ని భాగాలను పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించింది. ఇప్పుడు అక్కడి ప్రజలపై హింసకు పాల్పడుతోంది" అని భారత ఎంబసీ మండిపడింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో నిర్వహిస్తోన్న ఎన్నికల సందర్భంగా నిరసనకారులు, భద్రతా దళాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఆందోళనకారులపై పాకిస్థాన్ భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో.. ఇప్పటివరకు 40 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో పలు ఆంక్షలు అమల్లో ఉన్నాయి. ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు చేయడాన్ని నిషేధించారు. మరోవైపు ఆందోళనల్లో చనిపోయిన తమ వారి మృతదేహాలను భద్రతా దళాలు ఇవ్వడంలేదని పలు కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. పెరుగుతున్న ఖర్చులు, పాలనాపరమైన సమస్యలు, రాజకీయ వివక్ష వంటి అంశాలకు వ్యతిరేకంగా జరుగుతోన్న ఈ నిరసనలకు జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ నాయకత్వం వహిస్తోంది. కాగా.. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో శాసనసభ ఎన్నికలు నిర్వహించడంపై భారత్ స్పందించిన సంగతి తెలిసిందే. ఆ ప్రాంతంలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలను కప్పిపుచ్చుకునేందుకు చేస్తున్న కపట ప్రయత్నాల్లో అవి భాగమని దాయాదిని దుయ్యబట్టింది.



# వాస్తవికంగా ఆలోచించండి.. హోటల్ లైసెన్స్ రద్దుపై కోర్టు

**ముంబాయి :** ఆహార భద్రతా ప్రమాణాలు ఉల్లంఘించే హోటల్స్‌పై మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ కఠినచర్యలు తీసుకుంటోంది. పలు ఆహార కేంద్రాల లైసెన్స్‌లు రద్దు చేస్తోంది. ఈ నేపథ్యంలో నవీ ముంబయికి చెందిన ఒక హోటల్ వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వాస్తవిక దృక్పథంతో వ్యవహరించాలని ఎఫ్‌డీఏకు సూచించింది. మహారాష్ట్ర వ్యాప్తంగా ఎఫ్‌డీఏ నిర్వహించిన డ్రైవ్‌లో దాదాపు 100 హోటళ్ల లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు. వాటిలో ఓ హోటల్ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. రాతపూర్వకంగా తగిన కారణాలు చెప్పకుండా లైసెన్స్ నిలిపివేయడాన్ని ప్రశ్నిస్తూ పిటిషన్ వేసింది. దీనిపై వాదనల అనంతరం హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "కొన్నిరోజుల క్రితం నా టేబుల్ దగ్గరకు ఒక పెద్ద కీటకం వచ్చింది. నేనిప్పుడు ఇలా మాట్లాడుతున్నానో లేదో ఒక ఈగ వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో మనం వాస్తవికంగా వ్యవహరించాలి" అని ధర్మాసనం పేర్కొంది. పరిశుభ్రత, నిర్వహణ, కార్యకలాపాల విషయంలో సంతృప్తికరమైన నివేదిక వచ్చినప్పుడు.. రెండు కీటకాలను చూపించి పూర్తిగా లైసెన్స్ నిలిపివేయడాన్ని సమర్థించలేమని వ్యాఖ్యానించింది. అదే సమయంలో ప్రజారోగ్యాన్ని విస్మరించలేమని కూడా స్పష్టం చేసింది. ఆ హోటల్‌పై సస్పెన్షన్ విధిస్తూ ఎఫ్‌డీఏ తీసుకున్న నిర్ణయాన్ని కోర్టు తోసిపుచ్చింది. కాగా.. ఎఫ్‌డీఏ చర్యను ప్రభుత్వం తరఫు న్యాయవాది సమర్థించారు. ప్రజారోగ్యం విషయంలో ఉదాసీనతతో వ్యవహరించలేమని వాదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. "అలా అయితే ప్రభుత్వం ఆధ్వర్యంలోని క్యాంటీన్లు, హోటళ్లను తనిఖీ చేశారా..? హైకోర్టు క్యాంటీన్‌లో తనిఖీలు నిర్వహించారా..?" అని ప్రశ్నించింది. అందుకు ప్రభుత్వ న్యాయవాది కొన్ని ఉదాహరణలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బీఎంసీ క్యాంటీన్, మంత్రాలయ క్యాంటీన్ లైసెన్స్‌లను నిలిపివేసిన విషయాన్ని ప్రస్తావించారు. దాంతో "హైకోర్టు క్యాంటీన్‌లో గురువారం తనిఖీలు నిర్వహించి.. శుక్రవారం రిపోర్ట్ ఇవ్వండి" అని న్యాయస్థానం ఆదేశించింది.

# మైక్రోసాఫ్ట్ నుంచి సరికొత్త ఏఐ సూపర్ యాప్

## సీఈవో సత్యనాదెళ్ల



ఓపెన్ఏఐ, ఆంత్రోపిక్‌కు పోటీగా మైక్రోసాఫ్ట్ కూడా సరికొత్త ఏఐ సూపర్ యాప్‌ను తీసుకురానుంది. ఈ విషయాన్ని కంపెనీ త్రైమాసిక ఫలితాల విడుదల వేళ సీఈవో సత్య నాదెళ్ల వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోపైలట్ చాలా వేగంగా చాట్‌బాట్ స్థాయిని దాటి సరికొత్త సూపర్ యాప్ రూపును సంతరించుకొంటోందని పేర్కొన్నారు. ఇది కీలక ముందడుగు అని అభివర్ణించారు. భవిష్యత్తులో దీనికి సంబంధించి మరిన్ని వివరాలు పంచుకొంటామని తెలిపారు. సాధారణ ఏఐ యాప్స్‌తో చేసే వాటి కంటే తమ సూపర్ యాప్‌తో చాలా పనులు సులువుగా చేయవచ్చని వివరించారు. ఈ ఏడాది మైక్రోసాఫ్ట్ వార్షిక ఆదాయం 331 బిలియన్ డాలర్లను దాటిందని సత్య నాదెళ్ల పేర్కొన్నారు. క్లౌడ్ వ్యాపారం 214 బిలియన్ డాలర్లుగా ఉందన్నారు. ఓ రకంగా తమ కంపెనీ ఆదాయం 2025లో ఈజిప్ట్ జీడీపీకి దగ్గర్లో ఉందని వ్యాఖ్యానించారు. జూన్ 30 నాటికి ముగిసిన త్రైమాసికానికి నికర ఆదాయం 35.8 బిలియన్ డాలర్లకు పెరిగిందని చెప్పారు. మరోవైపు దక్షిణ కొరియా టెక్ దిగ్గజం శామ్‌సంగ్ కూడా ఈ సారి కంపెనీ చరిత్రలో ఎన్నడూ ప్రకటించనంత లాభాన్ని వెల్లడించింది. మొత్తం 62 బిలియన్ డాలర్ల నిర్వహణ లాభం వచ్చినట్లు వెల్లడించింది. దీంతో దక్షిణ కొరియా మార్కెట్ సూచీ కోస్పి గురువారం కొంచెం పుంజుకొని దాదాపు 4%కి పైగా లాభాలను నమోదు చేసింది.



# బిజినెస్



# 6 శాతం పడిపోయిన బంగారం డిమాండ్

బంగారం కొనుగోళ్లకు దూరం ఉండాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు, పెరిగిన ధరలు ఈసారి బంగారం గిరాకీపై ప్రభావం చూపించాయి. ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో భారత్‌లో పసిడికి డిమాండ్ 6శాతం పడిపోయి 131.4 టన్నులుగా ఉందని ప్రపంచ స్వర్ణ మండలి వెల్లడించింది. అయితే, ధరలు ఆకాశాన్ని తాకడంతో విలువ పరంగా చూసుకుంటే గిరాకీ 50శాతం పెరిగి రూ.1,98,100 కోట్లకు చేరిందని తెలిపింది. 2026లో భారత్‌లో పుత్తడి డిమాండ్ 650 నుంచి 750 టన్నుల మధ్య ఉంటుందని డబ్ల్యూసీజీ అంచనా వేసింది. పశ్చిమాసియా ఉద్రికత్తల కారణంగా బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. ఈ క్రమంలోనే విదేశీ మాదక ద్రవ్యాన్ని కాపాడుకునేందుకు బంగారం కొనుగోళ్లను ఆపేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. దీనితో పాటు బంగారం దిగుమతులపై సుంకాలను విధించారు. ఈ క్రమంలోనే పసిడికి గిరాకీ తగ్గింది. జూన్ త్రైమాసికంలో ఆభరణాల డిమాండ్ 15 శాతం తగ్గి 75.1 టన్నులకు చేరింది. సుంకాల పెంపు, ప్రధాని పిలుపు మేరకు బంగారానికి డిమాండ్ తగ్గినప్పటికీ.. ఇది గ్రే మార్కెట్ నిర్వహణను, స్మగ్లింగ్‌ను ప్రోత్సహించే అవకాశం ఉందని డబ్ల్యూసీజీ రీజినల్ సీఈఓ సచిన్ జైన్ అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాలను సునిశితంగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. మరోవైపు, సమీక్షించిన త్రైమాసికంలో బంగారంలో పెట్టుబడులు పెరిగాయి. బార్, కాయిన్ డిమాండ్ 9 శాతం వృద్ధి నమోదు చేసి 50.3 టన్నులకు చేరింది. భారత గోల్డ్ ఈటీఎఫ్‌లు 4.2 టన్నులకు చేరాయి. మొత్తం బంగారం రీసైక్లింగ్ జూన్ త్రైమాసికంలో 17 శాతం తగ్గి 19.2 టన్నులుగా ఉంది. రెండో త్రైమాసికంలో నికర బంగారం దిగుమతులు 23 శాతం తగ్గి 98.1 టన్నులకు పడిపోయాయి.



# అజింక్య రహానే క్రికెట్‌కు గుడ్‌బై

## అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెబుతూ భావోద్వేగం

**టీమ్ఇండియా వెటరన్ ఆటగాడు అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పేశాడు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ భరిత వీడియోను షేర్ చేశాడు. ఆస్ట్రేలియాపై 2021లో బోర్డర్ - గావస్కర్ ట్రోఫీని టీమ్ఇండియాకు అందించిన కెప్టెన్‌గా అజింక్య రహానే చరిత్రలో నిలిచిపోతాడు. అయితే, చివరిసారిగా భారత జట్టుకు మూడేళ్ల కిందట ప్రాతినిధ్యం వహించిన అతడు.. పునరాగమనం కోసం వేచి చూసినా ఫలితం లేకుండాపోయింది. సెలక్టర్ల నుంచి పిలుపు రావడం కష్టమనే భావనతో ఇప్పుడు రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నాడు.**



**“ప్రతి దానికీ ఆరంభం.. ముగింపు ఉంటాయనేది జీవితసత్యం. సరైన సమయం వచ్చినప్పుడు వాటిని గౌరవించి ముందుకు సాగాలి. నేను కూడా నా బ్యాటింగ్ సమయంలో టైమింగ్‌పైనే ఆధారపడ్డాను. అలాగే దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకున్నా. ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. తదుపరి దశకు వెళ్లేందుకు ఇదే ఉత్తమ సమయం. భారత జట్టు క్యాప్‌ను ధరించాలనే కలను నెరవేర్చుకున్నా. వ్యక్తిగతంగా కంటే నా జట్టు, నా దేశం ముఖ్యమనే సూత్రాన్ని ఎల్లప్పుడూ పాటించా. మన తలంపు మంచిదైతే ఆటే మనల్ని రక్షిస్తుంది. నిజాయతీగా ఇప్పటి వరకు నా గేమ్ ఆడా. గత 20 ఏళ్లలో ఫస్ట్ క్లాస్ క్రికెట్ నుంచి భారత జట్టుకు ఆడే వరకూ ప్రతి క్షణం గర్వంగా ఫీలయ్యా. ఇక ఈ ప్రయాణానికి ముగింపు పలుకుతున్నా. కానీ, ఆటతో మాత్రం కాదు” అని రహానే ఉద్వేగానికి లోనయ్యాడు.**

“వచ్చే తరం కోసం సాయం అందిచేందుకు, నా అనుభవాలను పంచుకొనేందుకు తప్పకుండా ఆ దిశగా అడుగులు వేస్తా. నా ప్రయాణంలో గెలుపోటములు చూశా. ఆటను ఆస్వాదించే విషయంలో మాత్రం ఎక్కడా వెనుకడుగు వేయలేదు. ఈ సందర్భంగా బీసీసీఐ, ముంబయి క్రికెట్ అసోసియేషన్, సహచరులు, కోచ్‌లు, ఐపీఎల్ ఫ్రాంచైజీలు, నా కుటుంబ సభ్యులు, స్నేహితులు.. ఇలా నాకు బాసటగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మరీ ముఖ్యంగా క్రికెట్ అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతున్నా. అజింక్య అంటే ఎవరూ ఓడించలేరని అర్థం. కానీ, క్రికెట్‌లో చాలాసార్లు పరాజయాలను చూశా. క్రికెటర్లుగా మేం విజయంతోపాటు ఓటములనూ అనుభవిస్తాం. చాలా పొరపాట్లు చేసి ఉంటా. కానీ, నా మనసులో మాత్రం ఓటమికి చోటు లేదు. ప్రతిసారి విజయం కోసమే బరిలోకి దిగా. క్యాప్ నంబర్ 278కి గుడ్‌బై” అని రహానే వీడియోలో వ్యాఖ్యానించాడు. భారత్ తరఫున రహానే 85 టెస్టుల్లో 5,077 పరుగులు చేశాడు. ఇందులో 12 శతకాలు, 26 అర్ధశతకాలు ఉన్నాయి. ఇక 90 వన్డేల్లో 2,962 పరుగులు చేయగా.. మూడు సెంచరీలు, 24 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అంతర్జాతీయంగా 20 టీ20ల్లో 375 పరుగులు చేశాడు. ఒకే ఒక్క హాఫ్ సెంచరీ ఉంది. ఐపీఎల్‌లో 212 మ్యాచులకుగాను 5,367 పరుగులు చేశాడు.




# రెండో రోజూ లాభాల్లో సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా స్టాక్స్‌లో కొనుగోళ్లు కలిసొచ్చాయి. అమెరికా వడ్డీరేట్లు యథాతథంగా కొనసాగుతాయని పేర్కొన్నప్పటికీ.. భవిష్యత్‌లో రేట్ల పెంపు ఉంటుందన్న సంకేతాలతో మదుపర్లు అప్రమత్తత పాటించడం కనిపించింది. ఈ క్రమంలోనే వరుసగా రెండో రోజూ సూచీలు లాభపడ్డా యి. సెన్సెక్స్ 273.55 పాయింట్లు లాభంతో 77,928.15 వద్ద ముగిసింది. నిఫ్టీ 66.95 పాయింట్లు పెరిగి 24,317.15 వద్ద స్థిరపడింది. రూపాయితో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.67 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో మారుతీ, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, పవర్‌గ్రిడ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఆదానీ పోర్ట్స్, ఇండిగో, బజాజ్ బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, బీఈఎల్, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్ నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 91.09 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు ధర 4,068.45 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




# అదరగొట్టిన పారా అథ్లెట్లు.. స్వర్ణం - రజతం మనోళ్లవే

కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు మరో స్వర్ణ పతకం దక్కింది. అలాగే రెండు రజతాలు వచ్చి చేరాయి. ఇందులో గోల్డ్ - సిల్వర్ మెడల్స్‌ను పారా అథ్లెట్లు సాధించగా.. లాంగ్ జంప్‌లో ఒక రజత పతకాన్ని శ్రీ శంకర్ అందుకొన్నాడు. మరోవైపు భారత బాక్సర్లు కూడా మరో ఆరు మెడల్స్‌ను ఖాయం చేశారు. ఇప్పటికే నాలుగు నెగ్గిన బాక్సర్లు.. ఇప్పుడీ ఆరుతో గత కామన్వెల్త్ గేమ్స్ రికార్డును అధిగమించారు. ఇక 200 మీటర్ల పరుగు పందెంలో అనిమేశ్ కుజుర్ సెమీస్‌కు చేరాడు. తజిందర్ పాల్ సింగ్ తూర్, సమర్‌దీప్ సింగ్ గిల్ పురుషుల షాట్‌పుట్ ఫైనల్‌కు అర్హత సాధించారు. పురుషుల 100 మీటర్ల టీ47 విభాగంలో పారా అథ్లెట్లు దిలీప్ మహాదు గవిత్, మహమ్మద్ బాసిల్ అదరగొట్టారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన వీరు.. స్వర్ణం, రజత పతకాలను సాధించారు. గావిత్ కేవలం 10.71 సెకన్లలో రేసును పూర్తి చేయగా.. బాసిల్ 10.83 సెకన్లతో రెండో స్థానంలో నిలిచాడు. దీంతో ఒకే ఈవెంట్‌లో ఇద్దరు భారత పారా అథ్లెట్లకు పతకాలు రావడం గమనార్హం. ఇప్పుడీ గోల్డ్‌తో భారత్ ఖాతాలో మూడు స్వర్ణ పతకాలు వచ్చాయి. అంతకుముందు మీరాబాయి చాను (వెయిట్ లిఫ్టింగ్), షర్మిలా ధనకర్ (పారా అథ్లెట్ - షాట్‌పుట్) బంగారు పతకాలను సాధించారు. ప్రస్తుతం భారత్ ఖాతాలో 15 పతకాలు ఉన్నాయి. ఇందులో మూడు గోల్డ్, 9 సిల్వర్, మూడు కాంస్య పతకాలు ఉన్నాయి. పతకాల పట్టికలో భారత్ ఎనిమిదో స్థానంలో ఉంది.

# భారత్ తమ దేశానికి వస్తుందని ఆశిస్తున్నా..

## బంగ్లాదేశ్ అత్యంత సురక్షితం : తమీమ్ ఇక్బాల్



బంగ్లాదేశ్‌లో టీమ్ఇండియా పర్యటనపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. షెడ్యూల్ ప్రకారం గతేడాది ఆగస్టులో మూడు వన్డేలు, మూడు టీ20లను ఆడేందుకు భారత్ వెళ్లాలి. కానీ, ఆ దేశంలో ఉన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో నాడు సిరీస్ జరగలేదు. ఆ పర్యటనను ఈ ఏడాది సెప్టెంబర్‌కు వాయిదా వేస్తూ అప్పుడు నిర్ణయం తీసుకున్నారు. అయితే, బంగ్లాదేశ్‌లో భద్రతపరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉద్దేశంతో బీసీసీఐ పునరాలోచనలో పడింది. ఈ క్రమంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు తమీమ్ ఇక్బాల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తప్పకుండా తమ దేశానికి వస్తుందనే నమ్మకం ఉందన్నారు. “భారత్‌తో సిరీస్ గురించి ఇప్పుడే చెప్పలేను. కానీ, తప్పకుండా ఆ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటిస్తుందని ఆశిస్తున్నా. ఇప్పటికే బీసీసీఐతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఈమెయిల్స్ రూపంలోనూ చర్చలు జరుగుతున్నాయి. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నాం. భారత్ - బంగ్లాదేశ్ మధ్య సిరీస్ మరింత ఆసక్తికరంగా ఉంటుందని భావిస్తున్నా. బంగ్లా అత్యంత సురక్షితమైన దేశం. ఇక్కడ వారికి ఎలాంటి భద్రతాపరమైన ఇబ్బందులు ఉండవు. మా వైపు నుంచి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నాం” అని తమీమ్ స్పష్టం చేశారు.

### నాకూ పరిమితులు ఉంటాయి

భారత క్రికెట్ క్యాలెండర్‌లో సెప్టెంబర్ విండో ఖాళీగా లేదు. అఫ్గాన్‌తో మూడు టీ20ల సిరీస్‌లో టీమ్ఇండియా తలపడనుంది. ఇప్పుడు బంగ్లా పర్యటనను ఖరారు చేస్తే అఫ్గాన్‌తో సిరీస్‌ను వాయిదా వేయాల్సి ఉంటుంది. దీనిపైనా తమీమ్ స్పందిస్తూ “బీసీబీ అధ్యక్షుడిగా నాకూ కొన్ని పరిమితులు ఉంటాయి. వాటిని నేను క్రాస్ చేయలేను. నా బాధ్యత పరిధిలో సాధ్యమైనంత వరకూ సంబంధిత వ్యక్తులతో మాట్లాడుతూనే ఉన్నా. బంగ్లాతో సిరీస్ ఆడితే ప్రయోజనం ఏంటనేది వారికి వివరించే ప్రయత్నం చేస్తున్నా” అని తమీమ్ వ్యాఖ్యానించారు.




# స్విగ్గీ నష్టం రూ.791 కోట్లు..

## ఆదాయంలో మెరుగైన వృద్ధి

ముంబయి: ప్రముఖ ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ సంస్థ స్విగ్గీ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గానూ రూ.791 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1197 కోట్ల నష్టాన్ని కంపెనీ ప్రకటించింది. అప్పటితో పోలిస్తే నష్టం కాస్త తగ్గుముఖం పట్టింది. సమీక్షా త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం 37 శాతం వృద్ధితో రూ.6,182 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.4,961 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.7023 కోట్లుగా ఉంది. మొత్తం ఖర్చులు 25 శాతం పెరిగి రూ.7813 కోట్లకు చేరినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. స్విగ్గీకి ఫుడ్ డెలివరీ వ్యాపారం లాభాలను తెచ్చిపెడుతోంది. ఈ విభాగంలో 48 శాతం వృద్ధితో రూ.299 కోట్ల నికర లాభాన్ని నమోదుచేసింది. ఆదాయం 23 శాతం వృద్ధితో రూ.2,208 కోట్లుగా ఉంది. ఇన్‌స్టామార్ట్ రూ.651 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. ఆదాయం మాత్రం 53 శాతం వృద్ధితో రూ.1232 కోట్లకు పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో ఇన్‌స్టామార్ట్ డార్క్ స్టోర్ల సంఖ్య మరో 28 పెరిగాయి. మొత్తం స్టోర్ల సంఖ్య 1,171కు చేరింది.

# సూర్య 47 దీపావళి బరికోసం సిద్ధం




తమిళ స్టార్ హీరో సూర్యకు ఇప్పటికే వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య47' షూటింగ్‌ను పూర్తి చేశారు. చిత్రబృందం విడుదల చేసిన బీహైండ్ ది సీన్స్ వీడియోతో షూటింగ్ ముగిసిన విషయాన్ని అధికారికంగా వెల్లడించగా, ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీపై ఆసక్తికర చర్చ మొదలైంది. అందుతున్న సమాచారం ప్రకారం, 'సూర్య47'ను ఈ దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే సూర్యకు ఇది వరుసగా మూడో థియేట్రికల్ విడుదలగా నిలవనుంది. ఇప్పటికే 'కరుప్పు'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఆగస్టు 14న వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆ సినిమా విడుదలైన కొద్ది నెలలకే 'సూర్య47' కూడా థియేటర్లలోకి వస్తే, ఒకే ఏడాదిలో వం-సగా మూడు సినిమాలతో అభిమా నులను అలరించిన హీరోగా సూర్య నిలుస్తారు. అయితే దీపావళి బరిలో వెట్రిమా రన్ దర్శకత్వంలో సిలంబరసన్ టి.ఆర్ నటిస్తున్న 'అరసన్' కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.

# లెనిన్ సరికొత్త రికార్డులు

## వందకోట్ల క్లబ్బులో అఖిల్ లెనిన్ చేరిక

టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్‌లో తొలి బ్లాక్ బస్టర్‌ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డుల కెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హై-ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ కూడా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




# రామాయణ ట్రైలర్ విడుదల

## అద్భుత దృశ్య కావ్యంగా మలచిన నితీశ్ తివారి

ఎన్నిసార్లు విన్నా.. ఎంతమంది చెప్పినా.. ఎన్ని యుగాలు మారినా అజరామరం రామ చరితం.. 'రామాయణం' నిత్యనూతనం. ఇప్పటికే ఎన్నోసార్లు దృశ్యరూపం దాల్చిన ఈ మహాకావ్యం ఇప్పుడు మరోసారి నేటితరం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.దర్శకుడు నితీశ్ తివారీ మలిచిన 'రామాయణ' ట్రైలర్ బ్రహ్మ ముహూర్తంలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, అబ్బురపరిచేలా ఉన్న హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సీతారాముల కల్యాణం, వనవాసం, రామరావణుడి యుద్ధం.. ఇలా ప్రతి ఫ్రేమ్ ఆ అద్భుత గాథను కళ్లకు కడుతోంది. దేవలోకం.. భూలోకం.. పాతాళలోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం.. రావణ రాజ్యం' అంటూ యశ్ పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ ప్రారంభమైంది. యశ్ స్క్రీన్‌పై కనిపించిన ప్రతిసారీ తన గాంభీర్యం ప్రేక్షకులను మైమరిపి ంచింది. 'చీకట్లను పారదోలేందుకు ప్రతి యుగం లోనూ ఆ శ్రీమహావిష్ణువు అవతారమెత్తుతాడు' అంటూ రాముడి పాత్రను తీర్చిదిద్దిన విధానం ఆకట్టుకుంది. ప్రశాంతత, ధర్మనిష్ఠను ప్రతిబింబించే రాముడిగా రణ్‌బీర్ కపూర్ ఆకట్టుకున్నారు. మొత్తం నాలుగు నిమిషాల ఈ ట్రైలర్ సినీ ప్రేక్షకులను త్రేతా యుగానికి తీసుకెళ్లింది. ట్రైలర్‌లో ఎక్కువ చర్చిస్తున్న పాత్రల్లో ఒకటి సీతాదేవి. సాధారణంగా మృదుస్వభావిగా చూపించే సీతమ్మను ఇందులో ఖడ్గం పట్టిన యోధురాలిగా చూపించారు. లక్ష్మణ రేఖ సందర్భంలో కూడా ఆమె చేతిలో ఖడ్గం కనిపించ డంతో ఇందులో ఆమె పాత్రను కొత్తగా చూపిం చనున్నట్లు అర్థమవుతోంది. పుష్పక విమానం రామా యణంలో ఎంతో కీలకం. గతంలో వచ్చిన చిత్రాల్లో ఇది సాధారణంగా కనిపించినా.. ఈ సినిమాలో మాత్రం భారీ తామరపువ్వు ఆకారంలో ప్రత్యేక డిజైన్‌తో చూపించారు. ఇక, లంకను జయించిన తర్వాత మూడు లోకాలపై ఆధిపత్యం సాధించాలని రావణుడు సంకల్పిస్తాడు. ఈ క్రమంలో దేవేంద్రు డితో యుద్ధానికి సంబంధించిన సన్నివేశాల్లో ఐరావ తాన్ని అద్భుతమైన విజువల్‌తో ఆవిష్కరించారు. సీతను అపహరించే సమయంలో రావణుడిని అడు కునే జటాయు-ువు పాత్రకు ట్రైలర్‌లో మంచి ప్రాధా న్యం దక్కింది. భారీ గరుత్మంతుడిలా, శక్తిమంతమైన రూపంలో జటాయువును చూపించడం విశేషం. శూర్పణఖ భర్త విద్యుజ్జిహ్వ పాత్రలో వివేక్ ఒబెరాయ్ కనిపించారు. రావణుడికి ఆయనకు మధ్య జరిగే ఘర్షణ చూస్తుంటే.. ఇప్పటివరకూ రామాయణంలో తెరపైకి రాని పాత్రలకు కూడా సముచిత స్థానం కల్పించినట్లు తెలుస్తోంది. రాముడి వనవాసానికి కారణమైన మంథర పాత్రను శీబా చద్దా పోషించారు. కైకేయిగా లారా దత్త ప్రత్యేకంగా కన్పించారు. శివధనుస్సు విరిచిన అనంతరం పరశురాముడు రాముడిని కలిసే ఘట్టం కూడా ట్రైలర్‌లో ఉంది. తన ధర్మ బాధ్యతలను రాముడికి అప్పగించి తపస్సు కోసం వెళ్లే పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కన్పించడం ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసింది. రాముడిని తిరిగి అయోధ్యకు తీసుకురావడానికి చిత్రకూటానికి వెళ్తాడు భరతుడు. రాముడు నిరాకరించడంతో ఆయన పాదుకలను సింహాసనం పై ఉంచి రాజ్యాన్ని పాలించిన సోదరుడిగా ఆదినాథ్ కొఠారే ఆకట్టుకున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్,








లక్ష్మణుడిగా రవీ దూబే కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించి ఔరా అనిపించారు. రాముడిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం, లక్ష్మ ణుడు ఆమె ముక్కు కోసే సన్నివేశాలు ప్రత్యేకంగా నిలిచాయి. 'ప్రతీకారం తీర్చుకుంటాను శూర్పణఖ.. రాముడికి జరిగే అవమానం ఘోరంగా ఉంటుంది' అంటూ యశ్ చెప్పే డైలాగ్‌తో రామ-రావణ యు ద్ధం ఎంత భీకరంగా ఉ ంటుందో ట్రైలర్‌లో హింట్ ఇచ్చారు దర్శకుడు. ఇక ట్రైలర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన మరో విషయం.. నేపథ్య సంగీతం.. ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో పాటు ఏ.ఆర్.రెహమాన్ అందించిన సంగీతం సిని మా స్థాయిని మరింత పెంచేలా ఉంది. విజువల్స్‌కు తగ్గట్టుగా వినిపించిన సంగీతం.. ప్రతి సన్నివేశానికి వీక్షకులు లీనమయ్యేలా ఉంది. 'రామాయణ' ట్రైలర్ కేవలం ఓ సినిమా ప్రమోషన్‌లా కాకుండా భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ స్థాయిలో ఆవిష్కరించే మహత్తర సినీ ప్రయాణానికి నాందిగా నిలిచింది. మొదటి భాగం ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌లో విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి రూ.4000 కోట్ల బ్జడెట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. రామానంద్ సాగర్ ఆవిష్కరించిన ధారావాహికలో రాముడిగా కనువిందు చేసిన అరుణ్ గోవిల్ ఇప్పుడు దశరథుడిగా నటిస్తున్నారు. సీబా చద్దా.. మంథర పాత్ర పోషిస్తుండగా, శిశిర్ శర్మ వశిష్ఠ మహర్షిగా, అజింక్య దేవ్ విశ్వామిత్ర మహర్షిగా చేస్తున్నారు.

# సినిమా ప్రమోషన్లకు పిలవకపోవడంతో చాలా బాధపడ్డాను : రితిక నాయక్



టాలీవుడ్ యంగ్ బ్యూటీ రితిక నాయక్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. విశ్వక్ సేన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'అశోకవనంలో అర్జున కళ్యాణం' చిత్రంతో ఆమె తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఆ సినిమా మంచి విజయాన్ని అందుకోవడంతో రితికకు మంచి గుర్తింపు లభించింది. అనంతరం ఆమె నటించిన 'మీరాయ్' పాన్ ఇండియా స్థాయిలో విడుదలై విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఆమె క్రేజ్ మరింత పెరిగింది. ప్రస్తుతం రితిక నాయక్, వరుణ్ తేజ్ హీరోగా మెర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన 'కొరియన్ కనకరాజు' చిత్రంలో కథానాయికగా నటించింది. ఈ సినిమా ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న రితిక, తన తొలి సినిమా సమయంలో ఎదురైన ఓ అనుభవాన్ని పంచుకుంది. తాజా ఇంటర్వ్యూలో రితిక మాట్లాడుతూ.. నా తొలి సినిమా 'అశోకవనంలో అర్జున కళ్యాణం'. ఆ సినిమా ప్రమోషన్లకు నన్ను అసలు పిలవలేదు. దాంతో చాలా బాధపడ్డాను. ఆ విషయాన్ని నా స్నేహితురాలితో చెప్పుకుని ఎంతో ఫీల్ అయ్యాను. కానీ సినిమా విడుదలైన తర్వాత అందులో నటించిన వారందరిలో నాకే ఎక్కువ గుర్తింపు వచ్చిందని చెప్పుకొచ్చింది. ఇప్పటివరకు రితిక నాయక్ నటించిన చిత్రాలను గమనిస్తే, ఆమె కేవలం గ్లామర్‌తోనే కాకుండా తన సహజమైన నటనతో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ప్రస్తుతం 'కొరియన్ కనకరాజు' సినిమాపై కూడా ఆమె మంచి ఆశలు పెట్టుకుంది.

## మరో లవ్‌గ్రాక్ మూవీ

# శ్రీనివాసమంగాపురం

ఘట్టమనేని కుటుంబం నుంచి యువ హీరోగా పరిచయమ వుతున్న జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ కూతురు రాషా తడాని జంటగా నటించిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', మంగళవారం వంటి సంచలన చిత్రాల తర్వాత దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. మోహన్ బాబు, శ్యామ్, బ్రహ్మాజీ వంటి హేమాహేమీలు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువ-య్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ. దర్శకుడు అజయ్ భూపతి కూడా 'శ్రీనివాస మంగాపురం' కోసం ఇదే రొటీన్ మాస్ కమర్షియల్ బాటపట్టారు. స్టోరీ పరంగా పెద్దగా కొత్తదనం లేకపోయినా.. విలన్ క్రూరత్వం, హీరోయిన్ వెనక హీరో పడే లవ్ ట్రాక్, మధ్య మధ్యలో వచ్చే పాటలతో ప్రథమార్థం సాగిపోతుంది. జై కృష్ణ తన డాన్సులతో అలరించగా, నరేష్, బ్రహ్మాజీల కామెడీ మంచి రిలాక్సేషన్ ఇస్తుంది. ద్వితీయార్థంలో వచ్చే ప్లాష్ బ్యాక్, హీరో హీరోయిన్ల అసలు కథ, యాక్షన్ సీక్వెన్సెస్ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాయి. తన గత చిత్రాల తరహాలో కాకుండా, అజయ్ భూపతి ఎలాంటి రిస్క్ తీసుకోకుండా పూర్తిగా 'సేఫ్ గేమ్' ఆడేశారు. పకడ్బందీ స్క్రీన్ ప్లే, బలమైన క్యారెక్టరైజేషన్స్‌పై మరికాస్త దృష్టి పెట్టి ఉంటే ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మరో స్థాయిలో ఉండేది. జయకృష్ణ, రాషా తడాని తమ తొలి సినిమాతోనే అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. ముఖ్యంగా జయకృష్ణ ఎమోషనల్ సన్నివేశాల్లో మంచి పరిణతి చూపించాడు. డాన్సులు, యాక్షన్ సీక్వెన్స్‌లలోనూ ఆకట్టుకున్నాడు. రాషా తడాని కూడా తన అందం, అభినయంతో తొలి చిత్రంతోనే మంచి మార్కులు కొట్టేసింది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకే హైలైట్‌గా నిలిచింది. మోహన్ బాబు తన సీనియారిటీతో, పవర్ ఫుల్ ఇంటెన్సిటీతో పాత్రకు పూర్తి వన్యాయం చేశారు. కిక్ శ్యామ్, అజయ్ తమ విలనిజంతో సినిమాను నిలబెట్టగా.. బ్రహ్మాజీ, నరేష్‌ల కామెడీ అక్కడక్కడా నవ్విస్తుంది.



PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com